నగరంలో 'ఏటీఎం క్యాష్ ట్రాప్ ముఠా'

*** ప్లాస్టిక్ స్ట్రిప్‌లతో నగదు నిలిపివేసి తర్వాత కాజేస్తున్న దుండగులు**

జూబ్లీహిల్స్‌లో ఏటిఎంలో ప్లాస్టిక్ కార్డులు అడ్డు పెడుతున్న అగంతకులు

జూబ్లీహిల్స్, మే 15, ప్రభాతవార్త

నగరంలో కొత్తతరహా ఏటీఎం మోసాలు ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలోని పలుప్రాంతాల్లో ఏటీఎం కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని 'క్యాష్ ట్రాప్' ముఠా రెచ్చిపోతోంది. ఏటీఎం యంత్రాల్లో నగదు బయటకు వచ్చే స్లాట్ వద్ద పలుచటి ప్లాస్టిక్ కార్డులు, స్ట్రిప్‌లను అమర్చి వినియోగదారులు విత్‌డ్రా చేసిన డబ్బులు బయటకురాకుండా అడ్డుకుంటున్నారు. అనంతరం బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోయిన తర్వాత అదే ముఠాసభ్యులు వచ్చి చిక్కుకున్న నగదును కాజేస్తున్నారు. దీంతో ఖాతాదారులు డబ్బులు కోల్పోయామంటూ లబోదిబోమంటున్నారు.

15 రోజుల్లో మూడు ఘటనలు

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత 15 రోజుల వ్యవధిలోనే వరుసగా మూడు సంఘటనలు చోటుచేసుకోవడం కలకలం రేపుతోంది. బాధితులు డబ్బులు అకౌంట్ నుంచి డెబిట్ అయినప్పటికీ నగదు చేతికి రాకపోవడంతో బ్యాంకులను సంప్రదించారు. అనంతరం సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించిన బ్యాంకు అధికారులు మోసం జరిగినట్లు గుర్తించి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 4న రోడ్ నంబరు 36లోని ఎస్‌బిఐ ఏటిఎంలోకి వచ్చిన ఇద్దరు అగంతకులు ప్లాస్టిక్ కార్డులను అడ్డుగా పెట్టి తొలుత రూ. 8వేలు కాజేశారు. అలాగే 10వ తేదిన రూ.21వేలు, 14న రూ.20వేలు కాజేశారు. ఈ సంఘటనలపై ఇప్పటికే ఎస్బీఐ మేనేజర్ అనీల్‌కుమార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ప్రాంతాలే ప్రధాన లక్ష్యం

పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో ముఠా సభ్యులు ప్రధానంగా మాదాపూర్, రాయదుర్గం, వనస్థలిపురం, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోని ఏటీఎం కేంద్రాలనే లక్ష్యంగా ఎంచుకుంటున్నట్లు తెలిసింది. ఐటీ ఉద్యోగులు, రాత్రివేళల్లో నగదు విత్‌డ్రా చేసే వారు ఎక్కువగా వచ్చే కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు అనుమానిస్తున్నారు. ఈ నాలుగు ఠాణాల పరిధిలో ఇప్పటికే పలు సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఎంటిఎం కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉండటం, ఎలాంటి కాపలదారులు లేకపోవడంతో వారు ఆయా ఎటిఎం కేంద్రాలను లక్ష్యంగా చేసుకుంటున్నారు. జన సమ్మర్థం తగ్గిన తరువాత ఎటిఎం కేంద్రంలోకి వెళ్లి డబ్బు బయటకు వచ్చే ప్రాంతంలో ప్లాస్టిక్ కార్డులను అడ్డుగా పెట్టి ఈ దందాకు పాల్పడుతున్నారు. ముఖ్యంగా ఆదివారాలు, ప్రభుత్వ సెలవు దినాలు, బ్యాంకులు మూసివేసిన తర్వాత సమయాల్లో ఈ ముఠా చురుకుగా వ్యవహరిస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఆ సమయంలో బ్యాంకు సిబ్బంది అందుబాటులో లేకపోవడం, ఏటీఎం కేంద్రాల్లో భద్రతా సిబ్బంది తక్కువగా ఉండటం దుండగులకు అనుకూలంగా మారుతోంది.

మోసం ఇలా చేస్తున్నారు...

మోసగాళ్లు ముందుగా ఏటీఎం నగదు స్లాట్‌లో ప్లాస్టిక్ స్ట్రిప్ లేదా కార్డు ముక్కను అమరుస్తున్నారు. వినియోగదారు డబ్బులు విత్‌డ్రా చేసినప్పుడు నగదు బయటకు రాకుండా యంత్రంలోనే చిక్కుకుపోతుంది. దీంతో సాంకేతిక లోపం అనుకుని చాలామంది అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. కొంత దూరంలో నిఘా పెట్టిన ముఠా సభ్యులు బాధితుడు వెళ్లిన వెంటనే వచ్చి ప్లాస్టిక్ స్ట్రిప్‌ను తొలగించి నగదును తీసుకెళ్తున్నారు.

సీసీ కెమెరాల్లో ముఠా కదలికలు

కొన్ని ఏటీఎం కేంద్రాల్లోని సీసీ కెమెరాల్లో అనుమానితుల కదలికలు నమోదయ్యాయి. ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులుగా తిరుగుతూ ముందుగా ఏటీఎంను పరిశీలించడం, తర్వాత వినియోగదారుల కదలికలను గమనించడం, చివరికి చిక్కుకున్న నగదును తీసుకెళ్లడం వంటి దృశ్యాలు నమోదయ్యాయి. ఈ చోరిలకు పాల్పడుతున్న వారు దాదాపు పాతికేళ్లలోపు ఉండటం గమనార్హం.

ఇతర రాష్ట్రాల ముఠాలపై అనుమానం

ఈ తరహా మోసాలు గతంలో ఇతర మహానగరాల్లోనూ నమోదైన నేపథ్యంలో, హైదరాబాద్‌లో చురుకుగా ఉన్నది అంతర్రాష్ట్ర ముఠా కావచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఒకే తరహా పద్ధతిని అనుసరించడం, పలు ప్రాంతాల్లో ఒకే విధమైన ఘటనలు జరగడం దీనికి బలం చేకూరుస్తోంది. అయితే కొందరు స్థానికంగా ఉన్న యువకులు ముఠాగా ఏర్పడి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నట్లు సైతం పోలీసులు అనుమానిస్తున్నారు. ఏటీఎం వినియోగదారులు నగదు బయటకురాకపోతే వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోకుండా బ్యాంకు హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచిస్తున్నారు. నగదు స్లాట్ వద్ద ప్లాస్టిక్ ముక్కలు, టేపులు, అనుమానాస్పద వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. ఏటీఎం కేంద్రాల్లో ఒంటరిగా ఉన్న అనుమానితుల కదలికలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసుల గస్తీని పెంచుతామని చెబుతున్నారు.

హైదరాబాద్ వార్త

పెట్రో బాదుడు..

*** రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు**
*** లబోదిబోమంటున్న వాహన దారులు**
*** ప్రస్తుతం లీటర్ పెట్రోల్ -రూ.110.39, డీజిల్ రూ.98.96**
*** ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లోనే అధికం**

హైదరాబాద్, మే 15,ప్రభాతవార్త: అమెరికా, ఇరాన్ యుద్ధం నేపథ్యంలో తలెత్తుతున్న ఆటంకాల కారణంగా ఏర్పడిన ఇందన కొరతతో కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ వినియోగదారులకి షాక్ ఇచ్చింది. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలని రూ. 3 పెంచుతున్నట్లు ప్రకటించింది. కానీ ఎలాంటి పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదని ప్రభుత్వం తెలిపింది. ఇక తాజాగా ఆయిల్ ధర పెరుగుదలతో హైదరాబాద్‌లో పెట్రోల్ ధర లీటర్ రూ. 3.39 పెరిగి రూ. 110.89 ఉంది. నాలుగు సంవత్సరాల క్రితం చివరిసారిగా పెట్రోల్,డీజిల్ ధరలను పెంచగా మార్చినెలలో ప్రముఖ ఆయిల్ కంపెనీలైన హిందూస్తాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రీమియం పెట్రోల్ ధరలను పెంచాయి. అయితే ఇది ఎవరైతే కమర్షియల్‌గా పెట్రోల్‌ని వినియోగిస్తారో వారికి మాత్రమే వర్తించింది. తాజాగా రిటైల్ కస్టమర్స్‌కి పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతున్నట్లు ప్రకటించింది. సుమారు గత 3 నెలలుగా జరుగుతున్న అమెరికా ఇరాన్ యుద్ధం కారణంగా తలెత్తిన ఉద్రిక్తత పరిస్థితులు, అలాగే ఆయిల్ సరఫరాకి కీలకమైన హార్మోజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం వంటి పరిస్థితుల వల్ల క్రూడ్ ఆయిల్ సరఫరాలో తీవ్ర అంతరాయం నెలకొంది. అలాగే ఈ యుద్ధం కారణంగా క్రూడ్ ఆయిల్ ధరలు భారీగా పెరగడంతో మన ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు తీవ్ర నష్టాలను ఎదుర్కోవడం జరిగింది. దీని కారణంగా పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం పెంచినట్లు అధికారులు తెలుపుతున్నారు.

అదేదారిలో డీజిల్..

కేవలం పెట్రోల్ ధరలే కాకుండా డీజిల్ ధరలూ రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా లీటర్ డీజిల్ ధర రూ. 3.26 పెరిగి రూ. 98.96 ఉంది. నష్టాలను మూట కట్టుకుంటున్నామంటూ ఆయిల్ కంపెనీలు పెట్రోల్, డీజిల్ ధరలను ఇష్టానురీతిగా పెంచేస్తుండటంతో వినియోగదారులు గగ్గోలుపెడుతున్నారు. ఆయిల్ కంపెనీలు నష్టాల బారినుంచి బయటపడేందుకు రోజువారీగా వడ్డిం చేస్తున్నాయి. ప్రధానంగా డీజిల్‌ధరను పెంచడంతో ఈ ప్రభాతం అన్ని రంగాలపై పడుతుంది. రవాణారంగంపై దీని ప్రభావం పడి అన్ని రకాల వస్తువుల ధరలు చుక్కలంటుతున్నాయి. అనేక మంది మధ్యతరగతి జీవులు చాలీచాలని జీతాలతో వారివారి వృత్తుల నిర్వహణకు ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేస్తున్నారు. పెట్రోల్ ధరలు మరింత ప్రియం కానుండటంతో వారి ఆదాయంలోని సగభాగం పెట్రోల్‌కు కేటాయించాల్సి వస్తోందంటూ వాపోతున్నారు.

హైదరాబాద్‌లోనే అధికం..

తాజాగా ధరల పెంపుతో దేశంలోని ప్రముఖ నగరాలన్నింటికంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లోనే పెట్రోల్ ధర అత్యధికంగా ఉన్నాయి. నగరంలో లీటరు పెట్రోల్ ఏకంగా రూ. 3.39 పెరగడంతో ప్రస్తుతం లీటరుధర రూ.110.89కి చేరింది. ఈ జాబితాలో కేరళ రాజధాని తిరువనంతపురం రెండో స్థానంలో నిలిచింది. అక్కడ రూ.3.37 పెరగడంతో లీటరు పెట్రోల్ ధర రూ.110.75 ఆతర్వాతి స్థానంలో కోల్‌కతా(రూ. 108.74), పాట్నా (రూ.108.55), జైపూర్ (రూ. 108.19) నిలిచాయి. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో పెట్రోల్ ధర రూ.106 దాటి లీటరు రూ.106.64 వద్ద విక్రయిస్తున్నారు. అలాగే పెట్రోల్‌తో పాటే డీజిల్ ధరలు దేశవ్యాప్తంగా పైపైకి దూసుకెళ్లాయి. లీటరు డీజిల్ ధర అత్యధికంగా తిరువనంతపురంలో రూ. 99.63 (రూ.3.37 పెంపు)గా నమోదై సెంచరీ మార్కుకు చేరువులో నిలిచింది. ఈ జాబితాలో హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. హైదరాబాద్‌లో లీటరు డీజిల్ రూ.3.26 పెరగడంతో ధర రూ. 98.96కి ముట్టింది. ఆ తర్వాత భువనేశ్వర్ (రూ.96.11), చెన్నై (రూ.95.47), కోల్‌కతా (రూ.95.13)లు ఉన్నాయి. మిగతా మెట్రో నగరాలతో పోలిస్తే దేశ రాజధాని ఢిల్లీలో ఇంధన ధరలు కొంత తక్కువగా ఉన్నాయి. అక్కడ లీటరు పెట్రోల్ ధర రూ. 97.77 గాను, డీజిల్ ధర రూ.90.67 గాను కొనసాగుతోంది. ఈ ఆకస్మిక ధరల పెరుగుదల రవాణా రంగంతోపాటు సామాన్యుడి జేబుకు చిల్లుపడనుంది.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని రక్షించిన కాచిగూడ పోలీసులు

ఆత్మహత్యా యత్నం.. కాపాడిన పోలీసులు

హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త : కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో రైలు కిందపడి ఆత్మహత్యకు యత్నించిన ఒక వ్యక్తిని కాచిగూడ లా అండ్ ఆర్డర్ పోలీసులు సకాలంలో స్పందించి, చాకచక్యంగా ప్రాణాలతో రక్షించారు. గురువారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో కాచిగూడ రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌పై ఒక వ్యక్తి ఆత్మహత్యకు యత్నిస్తున్నట్లు చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ ద్వారా కాచిగూడ పోలీసులకు డయల్ 100 ద్వారా సమాచారం అందింది. సమాచారం అందిన వెంటనే కాచిగూడ పోలీస్‌స్టేషన్ పెట్రోల్ వాహనం1 సిబ్బంది, ఎన్ఆర్ఓ మరియు బ్లూకోల్ట్స్ సిబ్బందితో కలిసి అత్యంత వేగంగా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అక్కడ ఒక వ్యక్తి రైల్వే ట్రాక్‌పై పడుకుని ఉండటాన్ని గమనించిన పోలీస్ సిబ్బంది, ఏమాత్రం ఆలస్యం చేయకుండా ట్రాక్ పైనుంచి పక్కకు లాగేశారు. ఆ సమయంలో సదరు వ్యక్తి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు కోసం ట్రాక్‌పై వేచి ఉన్నట్లు తేలింది. పోలీసులు చూపిన సమయస్ఫూర్తితో ఒకరి ప్రాణం సురక్షితంగా నిలిచింది.

విచారణ వివరాలు...

పోలీసుల ప్రాథమిక విచారణలో సదరు వ్యక్తి వివరాలు కర్ణాటకలోని బీదర్ ప్రాంతానికి చెందిన మాధవ్(33), తండ్రి సుదామ్, వృత్తి వ్యవసాయం అని తెలిసింది. అతడు ప్రస్తుతం మలక్‌పేటలోని సోదరి ఇంట్లో తల్లి, సోదరితో కలిసి నివసిస్తున్నాడు. గురువారం కుటుంబ విషయాలపై సోదరితో జరిగిన గొడవలో ఆమె మందలించడంతో మాధవ్ తీవ్ర మనస్తాపానికి లోనయ్యాడు. దీంతో తీవ్ర నిరాశతో మద్యం తాగి, ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రాక్‌పైకి వచ్చాడు. అయితే, విపరీతంగా మద్యం తాగి ఉండటం వల్ల సరిగ్గా కదలలేని స్థితిలో ఉన్న అతను, చివరి నిమిషంలో ..మరణ భయంతో తనే స్వయంగా డయల్ 100కు ఫోన్‌చేసి రక్షించాల్సిందిగా కోరినట్లు విచారణలో వెల్లడైంది. ఆత్మహత్యకు యత్నించిన మాధవ్‌ను రక్షించిన కాచిగూడ లా అండ్ ఆర్డర్ పోలీసులు, తదుపరి సహాయం, కౌన్సిలింగ్ చట్టపరమైన అవసరమైన చర్యల నిమిత్తం అతడిని సురక్షితంగా కాచిగూడ ప్రభుత్వ రైల్వే పోలీస్ సిబ్బందికి అప్పగించారు.

బేగంపేటలో మరో సైబర్ నేరం

ఏపీకే ఫైల్ పంపి రూ 1,17,200 నగదు అపహరణ

బేగంపేట మే 15, ప్రభాతవార్త : ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేసి బ్యాంకు ఖాతాల్లో ఉన్న నగదును పోగొట్టుకోకండి అంటూ నగర పోలీసులు ప్రతి రోజు అవగాహన కల్పిస్తున్నా కొందరు అలాంటి ఫైల్స్ ఓపెన్‌చేసి నగదును పోగొట్టుకుంటూనే ఉన్నారు. ఇలాంటి సంఘటనే బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలోనూ చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బేగంపేట పాటిగడ్డకు చెందిన గౌస్‌పాషా టైలర్‌గా పనిచేస్తుంటాడు. అమెరికాలో చదువుకుంటున్న మేనకోడలు పర్వీన్‌బాను బ్యాంకు ఖాతాలను కూడా గౌస్ పాషానే నిర్వహిస్తుంటాడు. ఇటీవల ఆయన ఫోన్‌కు సైబర్ నేరగాళ్లు గుర్తు తెలియని ఏపీకే ఫైల్‌ను పంపారు. ఈ ఫైల్‌ను గౌస్‌పాషా ఇన్‌స్టాల్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. అయితే వెంటనే రంగంలోకివచ్చిన సైబర్ మోసగాళ్లు ఆయన మేనకోడలు పర్వీన్ భాను ఖాతాను హ్యాక్‌చేసి ఆమె ఖాతా నుంచి రూ 1,17,200లు నగదును కాజేశారు. మే 6వ తేదీన పర్వీన్ భాను హెచ్‌డీఎఫ్‌సి ఖాతా నుంచి ప్రకాష్ హార్డ్‌వేర్ పేరిట ఉన్న యూపీఐకి రూ 90వేలు,మే 7న యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి మనోజ్,బంటి పేర్లతో ఉన్న ఖాతాకు రూ 27,200లు బదిలీ అయినట్లు గుర్తించారు.బాధితుడు బేగంపేట పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

నార్సింగి, మే 15 ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన నార్సింగి పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం బండ్లగూడ సాయిహర్ష నగర్ ప్రాంతానికి చెందిన వినయ్‌కుమార్ కుమారుడు ఉయ్యాల సరిష్ (23) విద్యార్థి. శుక్రవారం ఉదయం స్నేహితుడు క్రిష్‌సింగ్(23)తో కలిసి కాళీమందిర్ సమీపంలో టిఫిన్ చేసి ద్విచక్రవాహనం(టిజి 07 ఎఆర్ 0605)పై తిరిగి ఇంటికి వెళ్తుండగా వేగం అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న అడ్వర్టైజింగ్ బోర్డుకు ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సరిష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. క్రిష్‌సింగ్‌కు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి, ఈ మేరకు పోలీసులుకేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌పిఎఫ్ అప్రమత్తతతో

120 మంది చిన్నారులకు రక్ష

దక్షిణమధ్య రైల్వేలో ప్రత్యేక ఆపరేషన్లతో నేరాల నియంత్రణ

తార్నాక, మే 15 ప్రభాతవార్త : దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే రక్షణ దళం(ఆర్‌పిఎఫ్) 2026 ఏప్రిల్‌లో చేపట్టిన ప్రత్యేక భద్రతా చర్యలు గణనీయ ఫలితాలను ఇచ్చాయని ఆర్‌పిఎఫ్ అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా "ఆపరేషన్ నన్హే ఫరిస్తే" కింద తప్పిపోయిన లేదా కుటుంబాలకు దూరమైన 120 మంది చిన్నారులను రక్షించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించడం విశేషంగా నిలిచింది. వీరిలో 96 మంది బాలురు, 24 మంది బాలికలు ఉన్నారు. ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణ, నేర నియంత్రణ లక్ష్యంగా ఆర్‌పిఎఫ్ నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తోందని అధికారులు తెలిపారు. ప్రభుత్వ పోలీసు శాఖలు, ఇతర చట్ట అమలు సంస్థలతో సమన్వయంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లు మంచి ఫలితాలను అందించాయని పేర్కొన్నారు. ఆపరేషన్ యాత్రి సురక్ష"లో భాగంగా 79 మంది నేరస్థులను అరెస్టు చేసి 71 కేసులు నమోదు చేశారు. ఈ చర్యల్లో దాదాపు రూ.54.52 లక్షల విలువైన దొంగిలించిన ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. "ఆపరేషన్ అమానత్" ద్వారా ప్రయాణికులు కోల్పోయిన రూ.83.35 లక్షల విలువైన 319 వస్తువులను గుర్తించి యజమానులకు అప్పగించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టే ఆపరేషన్ నార్కోస్"లో రూ.86.17 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని 16 మందిని అరెస్టు చేశారు."ఆపరేషన్ ఆహత్"లో మానవ అక్రమ రవాణాదారుల బారి నుంచి ఐదుగురు బాలురను రక్షించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆపరేషన్ జీవన్ రక్ష"లో ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడగా, ఆపరేషన్ సతర్క్"లో అక్రమ మద్యం రవాణాపై చర్యలు చేపట్టారు. అలాగే ఆపరేషన్ ఉపలబ్ధ్" కింద టికెట్ దళారులపై దాడులు నిర్వహించి 26 మందిని అరెస్టు చేశారు. సీసీటీవీ సాంకేతికత సహాయంతో 11 మంది నేరస్థులను పట్టుకుని రూ.26.65 లక్షల విలువైన దొంగిలించిన ఆస్తులను రికవరీ చేశారు. రైల్వే ఆస్తుల రక్షణకు చేపట్టిన "ఆపరేషన్ రైల్ సురక్ష"లో 36 కేసులను గుర్తించి రూ.6 లక్షలకు పైగా విలువైన రైల్వే సామగ్రిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

రెడ్ క్రాస్ సేవలు ప్రజల్లో మరింతగా వెళ్లాలి

-జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా

హైదరాబాద్,మే 15,ప్రభాతవార్త: జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలు ప్రజల్లో విస్తృతంగా వెళ్లాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సభ్యత్వ నమోదు కేంద్రాన్ని రెడ్ క్రాస్ చైర్మన్ ఎం.భీమ్‌రెడ్డితో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర గవర్నర్ పిలుపు మేరకు జిల్లాలో సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగవంతంగా కొనసాగాలని ఈనెల 15 నుండి జూన్ 15 వరకు పూర్తిస్థాయిలో కార్యక్రమాన్ని చేపట్టి ఎక్కువ నమోదు అయ్యేవిధంగా చూడాలని సభ్యులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ సాయి సుమన్, జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సెన్సెస్ ఎలా జరుగుతోంది..?

హౌస్ లిస్టింగ్ తీరును పరిశీలించిన ఆర్.వి.కర్ణన్

హైదరాబాద్,మే 15,ప్రభాతవార్త: జీహెచ్ఎంసీ కమిషనర్ ,ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ఆర్.వి. కర్ణన్ శుక్రవారం సెన్సెస్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శంషాబాద్ అదనపు కమిషనర్ (ఎన్నికలు) జోనల్ కమిషనర్ కుమారి చంద్రకళ, శంషాబాద్ డిసి సుమన్ రావు లతోకలిసి శంషాబాద్‌లోని ఎన్యూమరేషన్ బ్లాక్ నెం. 83 94లో కొనసాగుతున్న జనాభా లెక్కల గృహాల జాబితా ఆపరేషన్ ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్యూమరేటర్లు,పర్యవేక్షక సిబ్బందితో మాట్లాడారు. గృహాల జాబితా,జనాభా వివరాల సేకరణ కోసం అనుసరిస్తున్న విధానాలను పరిశీలించారు. అలాగే ఈ ప్రక్రియను ఒక నెలలోగా, అనగా 9జూన్ 2026లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి ఇంటిని తప్పకుండా కవర్ చేయాలని సిబ్బందికి సూచించారు. జనాభా లెక్కల సిబ్బందికి సహకరించాలని ప్రజలను కోరారు.

ఎన్యూమరేటర్ వివరాలతీరును పరిశీలిస్తున్న కమిషనర్ కర్ణన్, జెడ్‌సి చంద్రకళ

మెట్రో రైల్లో ప్రయాణిస్తున్న రాంచందర్ రావు

మెట్రోలో ప్రయాణించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు

తార్నాక, మే 15 ప్రభాతవార్త : ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపునకు అనుగుణంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు శుక్రవారం తార్నాక నుంచి జూబ్లీహిల్స్ వరకు మెట్రో రైల్లో ప్రయాణించి ప్రజలకు ప్రత్యేక సందేశం ఇచ్చారు. ఇంధన పొదుపు, ప్రజా రవాణా వినియోగం, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో కారుకు బదులుగా మెట్రోను ఎంచుకున్న రామచందర్‌రావు సాధారణ ప్రయాణికుడిలా ప్రజల మధ్య మమేకమై ప్రయాణించారు. ఈ సందర్భంగా మెట్రో ప్రయాణికులతో ఆప్యాయంగా మాట్లాడి ప్రజా రవాణా వినియోగంవల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించి ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా ఉపయోగించాలని ప్రధాని మోదీ సూచించిన నేపథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దేశ ఆర్థిక భారాన్ని తగ్గించడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రిక్ వాహనాలు, ప్రజారవాణా వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, విదేశీ ఆధారిత ఇంధన వినియోగాన్ని తగ్గించడం ద్వారా దేశ ఆర్థిక స్వావలంబన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనతో స్వదేశీ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆడంబరాలు తగ్గించి పొదుపు పెంచుకోవాలని ప్రజలకు సూచించారు. 'దేశం కోసం.. భవిష్యత్తు కోసం.. మనందరి బాధ్యత' అనే సందేశంతో ప్రధాని మోదీ సూచించిన బాధ్యతాయుత జీవన విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ కట్టుబడి ఉందని రామచందర్ రావు స్పష్టం చేశారు.

ఘనంగా రైల్వే ఫిజిషియన్ల 21వ వార్షిక సదస్సు

దేశవ్యాప్తంగా 250 మంది వైద్య నిపుణులు హాజరు

సదస్సును ప్రారంభిస్తున్న డైరెక్టర్ జనరల్ డా. జగదీష్‌చంద్ర, ఇతర డాక్టర్లు

తార్నాక, మే 15 ప్రభాతవార్త : దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో రైల్వే ఫిజిషియన్ల 21వ వార్షిక సదస్సు(ఏపీఆర్‌కాన్) సికింద్రాబాద్‌లోని ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌లో ఘనంగా ప్రారంభమైంది. మే 15, 16 తేదీల్లో నిర్వహిస్తున్న ఈ సదస్సుకు భారతీయ రైల్వేలు, దేశంలోని ప్రముఖ ఆరోగ్య సంరక్షణ సంస్థలకు చెందిన సుమారు 250 మంది సీనియర్ వైద్య నిపుణులు హాజరయ్యారు. శుక్రవారం జరిగిన ప్రారంభ సమావేశానికి డైరెక్టర్ జనరల్ ఆర్‌హెచ్‌ఎస్ డాక్టర్ డాక్టర్ జగదీష్ చంద్ర, దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్, లాలాగూడ కేంద్ర ఆసుపత్రి వైద్యులు, దేశవ్యాప్తంగాఉన్న రైల్వే ఆసుపత్రుల నిపుణులు పాల్గొన్నారు. ఆవిష్కరణ నుండి ఆధారిత క్లినికల్ అన్వయానికి - ఖచ్చితత్వం,సాంకేతిక సహాయక సంరక్షణలో పరిణామ దృక్కోణాలు" అనే ఇతివృత్తంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్‌చంద్ర మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పురోగతులను కరుణామయ వైద్య సేవలతో అనుసంధానించడమే ఈ సదస్సు ప్రధాన లక్ష్యమని తెలిపారు. హైస్పీడ్ రైళ్లు, మౌలిక సదుపాయాల విస్తరణతోపాటు ఆరోగ్య సేవలు సాంకేతికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో జరిగే చర్చలు భారతీయ రైల్వే ఆరోగ్య వ్యవస్థకు కొత్త దిశానిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. డాక్టర్ నిర్మలా రాజారామ్ మాట్లాడుతూ భారతీయ రైల్వే వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణుల విశిష్ట సమావేశానికి దక్షిణ మధ్య రైల్వే ఆతిథ్యం ఇవ్వడం గర్వకారణమన్నారు. ఇది కేవలం సమావేశం మాత్రమే కాకుండా వైద్య నైపుణ్యాల మార్పిడి, వినూత్న విధానాల ఆవిష్కరణ, వృత్తిపరమైన బంధాల బలోపేతానికి వేదికగా నిలుస్తోందని తెలిపారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ హెల్త్ టెక్నాలజీలు, డేటా ఆధారిత వైద్య నిర్ణయాలు, ఖచ్చితమైన చికిత్సా విధానాలు వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు దారి తీస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. సదస్సులో కార్డియాలజీ, రుమటాలజీ, ఆంకాలజీ, న్యూరాలజీ తదితర విభాగాలకు చెందిన ప్రముఖ నిపుణులు ఆధునిక వైద్య రంగంలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై సమగ్ర విశ్లేషణ చేశారు. రోగనిర్ధారణ కచ్చితత్వం, చికిత్సా సామర్థ్యం, రోగి ఫలితాల మెరుగుదల లక్ష్యంగా సాంకేతికత ఆధారిత వైద్య విధానాలను సాధారణ క్లినికల్ సేవల్లో అమలు చేసే అంశాలపై చర్చించారు. రైల్వే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఆధునిక వైద్య సాంకేతికతలను తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా అమలు చేసే వ్యూహాలపై కూడా సమావేశంలో ప్రత్యేకంగా దృష్టి సారించారు. సదస్సు రెండో రోజు ఎండోక్రినాలజీ, నెఫ్రాలజీ, పల్మనాలజీకి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి.

ఖాళీగా ఉన్న ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలి

రాజ్యసభసభ్యుడు కృష్ణయ్య

హైదరాబాద్, మే 15 (ప్రభాతవార్త) : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. నిరుద్యోగ సమస్య రాష్ట్రంలో తీవ్ర స్థాయికి చేరుకుందని, యువతలో ఆందోళన పెరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వివిధశాఖల్లో వేల సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం భర్తీచేయడంలేదని విమర్శించారు. ముఖ్యంగా విద్య, వైద్యం, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్ తదితర శాఖల్లో ఖాళీలు అధికంగా ఉన్నాయని తెలిపారు. గతంలో ప్రకటించిన ఉద్యోగ నోటిఫికేషన్లలో కూడా అనేక పోస్టులు ఇంకా భర్తీ కాలేదన్నారు. పోలీస్ శాఖలో 18 వేల కానిస్టేబుల్ పోస్టులు, వివిధ విభాగాల్లో మరో 30 వేలకు పైగా ఖాళీలుఉన్నాయని పేర్కొన్నారు. గ్రూప్1లో 1600 పోస్టులు, గ్రూప్ 2 లో 3000 పోస్టులు, గ్రూప్3, గ్రూప్4లో కలిపి 20 వేల పోస్టులు భర్తీచేయాల్సి ఉందన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రులు, రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపాలిటీలు, పోలీస్ శాఖల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని చెప్పారు. విద్యాశాఖలో 40 వేలటీచర్, లెక్చరర్‌పోస్టులు 80 శాతం వరకు ఖాళీగా ఉన్నాయని, ఫలితంగా విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆర్.కృష్ణయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల్లో బోధన సరిగా సాగడంలేదని, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగాల భర్తీపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ నిరుద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల భర్తీతో పాటు నిరుద్యోగ భృతి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ప్రభుత్వ సలహాదారు విహెచ్‌ను సన్మానించిన సతీష్‌గౌడ్

విహెచ్‌ను కలిసిన బద్దం సతీష్‌గౌడ్

గన్‌ఫౌండ్రి, మే 15 ప్రభాతవార్త : బిసి సంక్షేమ ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మాజీ రాజ్యసభసభ్యులు, కాంగ్రెస్ నాయకులు వి.హనుమంత్‌రావు పదవీబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దం సతీష్‌గౌడ్ మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి, బొకె అందచేసి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు శివ తదితరులు పాల్గొన్నారు.

డిజిపిని కలిసిన ఉత్సవ సమితి ప్రతినిధులు

డిజిపి సి.వి ఆనంద్‌ను సన్మానించిన ఉత్సవ సమితి ప్రతినిధులు

బేగంబజార్, మే 15 ప్రభాతవార్త : భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సి.వి.ఆనంద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు డిజిపి కార్యాలయంలో డిజిపి సి.వి. ఆనంద్‌ను భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవినూతల శశిధర్, ఉపాధ్యక్షులు గోవింద్‌రాఠి, సలహాదారులు కరోడిమల్ నర్సింగ్ పూరియ, మహిపాల్‌రెడ్డి, అలే బాస్కర్ శాలువ కప్పి పూలమాలతో సన్మానించారు.

కవితా సంకలనం జనగీతిక ఆవిష్కరణ



జనగీతికను ఆవిష్కరిస్తున్న ఏనుగు నరసింహారెడ్డి తదితరులు

రవీంద్రభారతి, మే 15 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అందించిన లోకకవి డా. అందెశ్రీని స్మరించుకుంటూ కవులు జనగీతిక పేరున అక్షరాంజలి సమర్పించడం ఎంతో సబబని రాష్ట్ర బాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ప్రశంసించారు. శుక్రవారం రవీంద్రభారతిలోని కళాభవన్‌లో తన కార్యాలయంలో 67 మంది వర్ధమాన కవులు రాసిన కవితా సంకలనం జనగీతికను నరసింహారెడ్డి ఆవిష్కరించి అభినందించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి ఏఓ డా. పి.విజయ కుమార్, జనగీతిక సంకలనం సంపాదకుడు డా. తిరునగరి శ్రీనివాస్, సినీగేయరచయిత మౌనశ్రీ మాలిక్, సినీదర్శకుడు నామల రవీంద్రసూరి, గాయకులు సుధాకర్, కవి రచయిత మిద్దె సురేష్ పాల్గొన్నారు.

ఉత్తమ కాలనీలో దోమల నివారణపై అవగాహన

దోమల వ్యాప్తి నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పేట్‌బషీరాబాద్, మే 15, ప్రభాతవార్త: హెచ్ఎఎల్ రాఘవేంద్ర కాలనీకి మన నగరం కార్యక్రమంలో ఉత్తమ కాలనీ అవార్డు లభించిన సందర్భంగా, ఆ కాలనీలో జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులు దోమల నివారణకు శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని సూచిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి దోమల వ్యాప్తి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం కాలనీలో మందులు పిచికారీ చేసి పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధికారులు పద్మ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కుంట సిద్దిరాములు, గౌరవ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిడ్డి మల్లేశం, ఉపాధ్యక్షులు రాములు, జి. శ్రీనివాస్ రెడ్డి, ఆలయ చైర్మన్ టి. రాజేశ్వర్, ఆర్థిక కార్యదర్శి సిహెచ్ రాజు, బాలరాజు, శ్రీనివాస్ రెడ్డి, సుబ్బయ్యతో పాటు కాలనీ నాయకులు సంపత్, మాధవ రెడ్డి, బచ్చు జ్ఞానేశ్వర్, నరేందర్ రెడ్డి, అప్పల శేఖర్, నర్లకంటి కుమార్, ఎల్లాగౌడ్, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

20న బట్రాజ్ సర్పంచులు, కౌన్సిలర్లకు సన్మాన సభ

హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త: బీసీ సమాజ్ – బీసీ టైమ్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గెలిచిన బట్రాజ్ సామాజిక వర్గానికి చెందిన సర్పంచులు, వార్డు మెంబర్స్, మున్సిపల్ కౌన్సిలర్‌లకు ఈ నెల 20 వ తేదీన నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో అభినందన సభ నిర్వహిస్తున్నట్టు బీసీ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మీడియా సెంటర్లో అభినందన సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అధ్యక్షుడు సంగెం సూర్యారావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలిచిన బీసీ సామాజికవర్గంకు చెందినవారిని ఒక్కొక్కరిగా అభినందన సభలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. గతంలో రజక కుమ్మరి మంగలి గంగిరెద్దుల తమ్మలి సామాజిక వర్గాలకు సంబంధించిన ప్రజాప్రతినిధులను అభినందించి ప్రస్తుతం మే 20న భట్రాజ్ సామాజిక వర్గానికి సంబంధించిన ప్రజాప్రతినిధులకు అభినందన సభ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో భట్రాజు సామాజిక వర్గాల నుంచి చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలకు ఆ సభ ద్వారా తీర్మానాలు చేసి పంపించినట్టు అధ్యక్షులు సంగెం సూర్యారావు తెలిపారు. ఈకార్యక్రమంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి బట్టు విజయరాజ్, బీసీ సమాజ్ యువజన విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లూరి అర్జున్, రూపేష్ బట్రాజ్ సంఘం నాయకులు నందిబట్టు నరసింహారాజు, కాంచనపల్లి రాంబాబు రాజు, ఉపేంద్ర, కృష్ణ, కమల్, సరస్వతి, సత్యనారాయణరాజు, సరికొండ వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు..

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంగెం సూర్యారావు, విజయ్‌రాజ్ తదితరులు

హత్య కేసు మిస్టరీని ఛేదించిన పోలీసులకు సన్మానం

సనత్‌నగర్ బాలుడి హత్య కేసులో నిందితులకు కఠిన శిక్ష

దర్యాప్తు, ప్రాసిక్యూషన్ బృందాన్ని సన్మానిస్తున్న వీసీ సజ్జనర్

సంజీవరెడ్డి నగర్, మే 15, ప్రభాతవార్త: సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడేళ్ల క్రితం సంచలనం సృష్టించిన బాలుడి కిడ్నాప్, హత్య కేసులో నిందితులకు కఠినశిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించి సాక్షాధారాలు సమర్పించిన పోలీసు, ప్రాసిక్యూషన్ బృందాన్ని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి.వి.రామకృష్ణారావు, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ ఎం.ముత్తుయాదవ్, సనత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ డి.అశోక్, ఎస్ఐ అబ్దుల్ హయూమ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎన్.శేఖర్‌లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఇమ్రాన్ అలీఖాన్ అలియాస్ ఫిజా ఎనిమిదేళ్ల బాలుడు అబ్దుల్‌వాహిద్‌ఖాన్‌ను కిడ్నాప్ చేసి హత్య చేసినట్లు కోర్టు నిర్ధారించింది. ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత కక్షల కారణంగా ఈ నేరానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. నిందితుడు తన నివాసంలోనే బాలుడిని గొంతు నులిమి హత్యచేసి, అనంతరం మృతదేహాన్ని బకెట్‌లో పెట్టి సహ నిందితుడు మహమ్మద్ రఫీక్ సహాయంతో సమీప నాలాలో పడేసినట్లు పోలీసులు వెల్లడించారు. బాలుడు కనిపించడం లేదని తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదుచేసి సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక ఆధారాల ఆధారంగా నిందితులను గుర్తించారు. కేసులో కీలకమైన సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించడంతో మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా, అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి కమ్ ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి ఎం. వెంకటేశ్వరరావు ప్రధాన నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. అదనంగా కిడ్నాప్ కేసులో యావజ్జీవ కారాగార శిక్ష సాక్ష్యాధారాల ధ్వంసం కేసులో మరో ఏడేళ్ల జైలుశిక్షతో పాటు జరిమానా విధించారు. రెండో నిందితుడు మహమ్మద్ రఫీక్‌కు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారైంది. ఈ సందర్భంగా సీపీ సజ్జనర్ మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు వేగంగా న్యాయం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్ ఈ కేసులో కీలక పాత్ర పోషించిందన్నారు. డీసీపీ క్రైమ్స్ ఎస్. చైతన్యకుమార్, ఓఎస్డీ మల్లారెడ్డి పర్యవేక్షణలో అధికారులు సమన్వయంతో పనిచేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా కృషి చేశారని కొనియాడారు.

ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న మహిళా కాంగ్రెస్ నేతలు

పెట్రోల్, డీజిల్ ధరలపై మహిళా కాంగ్రెస్ నిరసన

హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త: పెట్రోల్,డీజిల్ ధరల పెంపుపై మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ధరలు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం మరో భారం మోపిందని మండిపడ్డారు. శుక్రవారం అంబర్‌పేటలోని పెట్రోల్ బంక్ వద్ద మహిళా కాంగ్రెస్ నేతలు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా శంభుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ రేట్లను మళ్లీ పెంచిన మోదీ ప్రభుత్వం సామాన్య ప్రజల నడ్డి విరుస్తోందని అన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, గ్యాస్, వంట నూనె, విద్యుత్ ఛార్జీలు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, ఖైరతాబాద్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే విజయరెడ్డి ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా కార్యదర్శులు లావణ్య, సోనియా, మారి, ఖైరతాబాద్ నియోకవర్గం అధ్యక్షురాలు కమల, బ్లాక్ ప్రెసిడెంట్ శ్రీదేవి, డివిజన్ అధ్యక్షులు సంధ్యారాణి, పార్వతి ,మాధవి, కవిత, సెలీనా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

బండ్లగూడ రోడ్డు ప్రమాదంపై ఎమ్మెల్యే సీరియస్

అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఓవైసీ

చాంద్రాయణగుట్ట, మే 15, ప్రభాతవార్త : బండ్లగూడ హైవే హోటల్ సమీపంలోని యూ టర్న్ వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై చాంద్రాయణగుట్ట శాసనసభ్యులు అక్బరుద్దీన్ ఓవైసీ తీవ్రంగా స్పందించారు. చాంద్రాయణగుట్ట డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్, చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు, మాజీ కార్పొరేటర్ అబ్దుల్ వాహబ్, మజ్లిస్ నేత హఫీస్ పటేల్ తదితరులతో కలిసి శుక్రవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులతో చర్చించిన తరువాత యూటర్న్‌ను మూసివేయాలని ఆదేశించారు. అనంతరం జీహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్‌తో మాట్లాడారు. చాంద్రాయణగుట్ట–బండ్లగూడ ప్రధాన రహదారిపై తరచు జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, ఆయా ప్రాంతాలలో వంతెనలు నిర్మించాలని సూచించారు.

పాతబస్తీలో పర్యటించిన ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

చార్మినార్, మే 15 ప్రభాతవార్త : ఎఐఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ శుక్రవారం యాకుత్ పుర నియోజకవర్గం పరిధిలోని చంచలం డివిజన్‌లో పర్యటించారు. దాదాపు తొంభై ఆరు లక్షల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులను ఎంపి అసదుద్దీన్ ఓవైసీ యాకుత్‌పుర శాసన సభ్యులు జాఫర్‌హుస్సేన్ మెహరాజ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఐఎం కార్పొరేటర్లు, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

18న సాలార్‌జంగ్ మ్యూజియంలో ఉచిత ప్రవేశం

చార్మినార్, మే 15 ప్రభాతవార్త : అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా మే 18వ తేదీన సాలార్‌జంగ్ మ్యూజియంలోకి ఉచిత ప్రవేశాన్ని కల్పిస్తున్నామని మ్యూజియం కీపర్ బి.ఆర్.నాయక్ తెలిపారు. 18వతేదీ సోమవారం ఉదయం 10 గంటలు నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకు సాలార్‌జంగ్ మ్యూజియం తెరిచి ఉంటుందని ఆయన తెలియజేశారు.

అక్క పెళ్లికి చేసిన అప్పు తీర్చలేక తమ్ముడు ఆత్మహత్య

హైదరాబాద్, మే 15,ప్రభాతవార్త: అక్క పెళ్లికి చేసిన అప్పు ఎలా తీర్చాలో తెలియక యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈవిషాదకర సంఘటన బాగ్ అంబర్‌పేట్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. అరవింద్, సంధ్య దంపతులకు కూతురు, కొడుకు శరత్‌కుమార్(23) ఉన్నారు. రెండేళ్ల క్రితం అప్పుచేసి కూతురు పెళ్లిచేయగా, పూర్తిగా మద్యానికి బానిసైన అరవింద్ ఏ పని చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. ఎంబిఏ మొదటి సంవత్సరం చదువుతున్న శరత్ కుమార్ తల్లి కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించడం చూసి తట్టుకోలేక, అప్పు తీర్చే మార్గం లేక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. శరత్ కుమార్ మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.

ఆర్థిక ఇబ్బందులతో మరో యువకుడు...

పేట్‌బషీరాబాద్, మే 15, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ పరిధిలోని ఎం.ఎన్.రెడ్డినగర్‌లో ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... వాసంశెట్టి నాగజ్యోతి ఫిర్యాదు మేరకు ఆమె భర్త వాసంశెట్టి రవీంద్ర(30), వృత్తిరీత్యా మేస్త్రీ, ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు మద్యం తాగడం, బెట్టింగ్ అలవాట్ల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటూ, కొంతకాలంగా పనికి వెళ్లకుండా మానసికంగా బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

పోక్సో బాధితురాలి వివరాల ప్రచారంపై కేసు నమోదు

పేట్‌బషీరాబాద్, మే 15, ప్రభాతవార్త : సైబరాబాద్ పరిధిలో పోక్సో కేసులో బాధిత బాలికకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు, ఆమె తల్లిదండ్రుల వివరాలను సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ ఫిర్యాదు మేరకు పెట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో జువెనైల్ జస్టిస్ చట్టం, బీఎన్ఎస్, పోక్సో చట్టాల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఖాతాల ద్వారా ఈ సమాచారాన్ని ప్రసారం చేస్తున్న వ్యక్తులను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాధితురాలి వ్యక్తిగత వివరాలు బహిర్గతం చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలు బాధిత కుటుంబానికి తీవ్ర మానసిక వేదన కలిగిస్తాయని పోలీసులు హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇటువంటి పోస్టులు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఘనంగా గ్రంథాలయ దినోత్సవం

చార్మినార్, మే 15 ప్రభాతవార్త : ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా విద్యా వారోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ప్రభుత్వ సిటీ కళాశాలలో గ్రంథాలయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన మాట్లాడుతూ వంద సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సిటీ కళాశాల గ్రంథాలయం వేలాది మంది అధ్యాపకులు, విద్యార్థుల జ్ఞాన దాహాన్ని తీరుస్తున్నదని అతి పురాతన విజ్ఞాన నిధి అని కొనియాడారు. గ్రంథాలయం సహకారంతో డిగ్రీ,పిజీ విద్యార్థులు ఐఐటి, ఎన్ఐటి. సెంట్రల్ యూనివర్సిటీతో పాటు విదేశీ విద్యా సంస్థలలో సీట్లను సాధిస్తున్నారని ఆమె తెలియజేశారు. తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు సిటీ కళాశాలలో ఉన్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని ఆమె తెలిపారు. సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సి.హెచ్.ప్రసాద్, గణిత శాస్త్రంలో విశేష పరిశోధన చేస్తున్న డాక్టర్.శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన గ్రంథాలయాధికారి డాక్టర్ రవికుమార్ చేగోని, కళాశాల దోస్త్ కన్వీనర్ ప్రొ. శంకర్‌కుమార్, కామర్స్ ,మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డా. మల్లికార్జున్‌ను కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన సత్కరించారు. ఐక్యూయేసి కన్వీనర్ ప్రొఫెసర్ జె.నీరజ సమన్వయం చేసిన ఈ కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ డి.ఎస్.ఆర్ రాజేందర్ సింగ్, ప్రొఫెసర్ బాల భాస్కర్, ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్‌తో పాటు కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన

నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలు

కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వసలహాదారు కేశవరావు, కేసిరెడ్డి ఉపేందర్‌రెడ్డి, తదితరులు

చిక్కడపల్లి, మే 15 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా అశోక్‌నగర్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యా వారోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. సంస్థ చైర్మన్ కేసిరెడ్డి ఉపేందర్ రెడ్డి, కార్యదర్శి పి.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యా వారోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పాఠశాల విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 1138 పాఠశాలల్లో గ్రంథాలయాల ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు ఇప్పటికే జారీ అయ్యాయని చెప్పారు. భారతదేశ చరిత్రలో పాఠశాల స్థాయిలో ఇంత భారీ సంఖ్యలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం ఒక చారిత్రాత్మక నిర్ణయమని అభివర్ణించారు. విద్యార్థుల్లో రీడింగ్ స్కిల్స్, రైటింగ్ స్కిల్స్ పెంపొందించడంతో పాటు సమాజంపై అవగాహన కల్పించడంలో గ్రంథాలయాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థుల్లో విజ్ఞాన సాధన, పఠన సంస్కృతి మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్, హైదరాబాద్ విద్యాశాఖ అధికారి రోహిణి పాల్గొన్నారు. గ్రంథాలయాల ఏర్పాటు నిర్ణయం వెనుక రాష్ట్ర గ్రంథాలయ సంస్థ, వివిధ జిల్లాల గ్రంథాలయ చైర్మన్లు, గ్రంథాలయ ఉద్యమ కార్యకర్తలు, పుస్తక ప్రియులు విశేష కృషి చేశారని వక్తలు కొనియాడారు. లైబ్రరీస్ డైరెక్టర్ శ్రీహరి, డిప్యూటీ డైరెక్టర్ హరిశంకర్, అసిస్టెంట్ డైరెక్టర్ నరసింహులు, గ్రంథాలయ ఉద్యోగులు చేసిన సేవలను సభలో ప్రశంసించారు.

కల్లు కాంపౌండ్ సమీపంలోని రోడ్డుపై పొంగుతున్న మ్యాన్ హోల్

ప్రకాశంనగర్‌లో పొంగుతున్న మ్యాన్‌హోల్స్

పట్టించుకోని వాటర్‌వర్క్స్, సీవరేజ్ అధికారులు

బేగంపేట మే 15, ప్రభాతవార్త : ప్రకాశం నగర్‌లో వాటర్‌వర్క్స్, సీవరేజ్ కార్యాలయం పక్కన, వెనుక వైపు ఉన్న బస్తీల్లో డ్రైనేజీలు యదేశ్ఛగా పొంగిపొర్లుతూ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అయినా సంబంధిత శాఖ సిబ్బంది, అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కొన్ని రోజులుగా డ్రైనేజీలు పొంగి పొర్లుతూ స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నా పట్టించుకోకపోవడంతో స్థానికులు కమ్యూనిటీ పోలీసు గ్రూపు బేగంపేటలో పోస్ట్ చేసారు. డ్రైనేజీలు పొంగుతుండటంతో వ్యర్థాలు రోడ్లపైన నిల్చి ఉంటున్నాయని, తీవ్ర దుర్వాసన వెదజల్లుతుందంటూ పోస్ట్ చేసారు. డివిజన్ పరిధిలోని ప్రకాశంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇదే విధమైన పరిస్థితి ఉందని, డివిజన్ పరిధిలోని భగవంతాపూర్ ప్రధాన రోడ్డుపైనా డ్రైనేజీ నిత్యం ప్రవహిస్తూ వాహనదారులకు, పాదచారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తుందని వారు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రకాశంనగర్, వికార్‌నగర్, ఎన్‌బిటీనగర్ వాసులు కోరుతున్నారు.

జనగణనకు ప్రజలు సహకరించాలి : రామకృష్ణారెడ్డి.

నార్సింగి, మే 15 ప్రభాతవార్త : జనగణనకు ఇళ్లకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు సహకరించాలని మణికొండ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మణికొండలోని తన ఇంటికి వచ్చిన ఎంఇఓ నిరంజన్, ఎన్యూమరేటర్లకు కుటుంబ సభ్యుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధికి జనగణన ఉపయోగకరంగా మారుతుందన్నారు. ఈ జనగణన వలన ప్రభుత్వాలకు తగిన డేటా వస్తుందని, దీన్ని ఆధారంగా చేసుకొని అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్యూమరేటర్లు రజని, లక్ష్మీ, ఇమ్రాన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యా వారోత్సవాలు

నార్సింగి, మే 15 ప్రభాతవార్త : పుస్తక పఠనం విద్యార్థి సమగ్ర వికాసానికి ఉపకరిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మణికొండ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యా వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ దినంను ప్రత్యేకంగా జరుపుకున్నారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే గ్రంథాలయంకు వెళ్లే అలవాటును దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. చదువులతో పాటు సామాజిక అంశాలు, క్రమశిక్షణ, గౌరవభావం వంటి మంచి లక్షణాలు గ్రంథ పఠనం ద్వారా అబ్బుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ నిరంజన్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ టి.మల్లేష్ ముదిరాజ్, మాజీ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీరాములు, నరేష్, ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, సావిత్రి, ప్రభావతి, హింద్రా, గంగాధర్, లక్ష్మయ్య, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

చిక్కా దేవదాసుకు స్థితప్రజ్ఞ బిరుదు ప్రదానం

చిక్కడపల్లి, మే 15(ప్రభాతవార్త): చేనేత సామాజిక ఉద్యమ నాయకుడు ఆధ్యాత్మికవేత్త యోగా గురువు ప్రముఖ సంఘ సేవకులు డాక్టర్ చిక్కా దేవదాసు అని లంగాణ పర్యాటకాభివృద్ధి సంస్థ పూర్వ చైర్మన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని కళావెంకటదీక్షితులు కళావేదికలో కళానిలయం సాంస్కృతిక సేవాసంస్థ, ఓంకార సత్సంగం ఆధ్యాత్మిక సంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చిక్క దేవదాస్ కు స్థితప్రజ్ఞ బిరుదును ప్రదానం చేసి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, విశ్రాంత పోలీస్‌ఉన్నతాధికారి సుంకరి సత్యనారాయణ, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ డాక్టర్ టి.గౌరీ శంకర్ హాజరై పాల్గొని చిక్కా దేవదాసుకు బిరుదు ప్రదానం చేశారు. చిక్కా దేవదాసు జన్మదినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న కొత్తోజు నాగ చారి, పోసాల సరస్వతి, హనుమాండ్ల శ్రీకాంత్, చిక్కా దేవదాసు 2026 విశిష్ట ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు సురేందర్, పుష్పలత పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్‌లను సత్కారం

చిక్కడపల్లి, మే 15 (ప్రభాతవార్త) : తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు చైర్మన్‌గా బసవరాజు శ్రీనివాస్, వైస్ చైర్మన్‌గా పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్‌లు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా ప్రముఖ సంఘ సేవకులు, చిక్కడపల్లికి చెందిన బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నేత నైషధం సత్యనారాయణ మూర్తి శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఐటి శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ను సత్కరించారు. ఈ సందర్భంగా నైషధం సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ నూతనంగా ఏర్పాడిన పరిషద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ సమాజానికి న్యాయం జరగాలని ఆకాంక్షించారు.

ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనది

సినీ రచయిత శ్రీరామ్ చౌదరి

చిక్కడపల్లి, మే 15 (ప్రభాతవార్త) : ప్రపంచంలో కుటుంబ వ్యవస్థ ఎంతో పురాతనమైనదని సినీ రచయిత శ్రీరామ్ చౌదరి పేర్కొన్నారు. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం సందర్భంగా కుటుంబం అవార్డు ప్రదానం, కవి సమ్మేళనం, సాంస్కృతిక ప్రదర్శనలు ఘనంగా జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన ఈకార్యక్రమంలో అతిథులు మాట్లాడారు. వాకర్స్ క్లబ్ జిల్లా 301 గవర్నర్ డాక్టర్ బి.గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబం అనేది అతి ముఖ్యమైనది. కుటుంబానికి ఎంతో ప్రాధాన్యత కలిగిఉన్నదని, ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న మురళీ మోహన్ రాజును అభినందించారు. అనంతరం కుటుంబం అవార్డుగ్రహీతలు దుబ్బా భాస్కర్‌రావు, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ ఎమ్.మధుసూదన్ రావు, లిక్కి అనురుద్రా రెడ్డి, కోకిల సుజాత, ఆలియా భాను, మంజుల కుటుంబ సమేతంగా అవార్డుతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సేవారత్న వడ్లకొండ వెంకట్రావు లయన్ నిర్మలా ప్రభాకర్, డాక్టర్ రాధ కుసుమ, కె.మురళీమోహన్ రాజు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై నిర్లక్ష్యం వద్దు

ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి

హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త: మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో సిబ్బంది మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఏ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణ, ఫీల్డ్ స్థాయి పనితీరును మరింత సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సాట్ ద్వారా ఇంటింటికీ అనుసంధానం పూర్తి చేసి, మిగిలిన గ్యాప్‌లను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. గుర్తించిన భవన నిర్మాణ వ్యర్థాలను వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. స్వీపర్ల హాజరును నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎక్కువకాలం గైర్హాజరయ్యే సిబ్బందికి బదులుగా ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న పనులు, ప్రజలకు అందిస్తున్న సేవలు, పెండింగ్ సమస్యలు, పారిశుధ్య నిర్వహణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం తదితర అంశాలపై సమావేశంలో సమగ్రంగా చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా విధులు నిర్వహించాలని, ప్రతి విభాగం పనితీరుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అంతకు ముందు ఆయా ప్రాంతాల్లో కమీషనర్ పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు.

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయాలి'

సైఫాబాద్, మే 15 ప్రభాతవార్త: ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు చెల్లించాలని, పురుషులతో పాటు మహిళలకు సమాన వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ శ్రమశక్తి అవార్డు గ్రహీత, తెలంగాణ ప్రైవేటు ఉద్యోగుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గంధం రాములు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శ్రమశక్తి అవార్డుగ్రహీత రాములకు జరిగిన 'అభినందన సభ'లో ప్రసంగించారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా ఆయన్ని ఘనంగా సత్కరించారు. అనంతరం రాములు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను అమలు చేయాలని, తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఒక ప్రైవేటు ఎంప్లాయిమెంట్‌బోర్డును ఏర్పాటు చేయాలని, తెలంగాణ రాష్ర ంలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టిలకు రూల్ ఆఫ్ రిజర్వేషన్‌లు అమలు చేసి స్థానికులకే ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కులు, డిమాండ్ల సాధన కోసం నిత్యం ఉద్యమిస్తామని ఆయన స్పష్టం చేశారు. సభకు అధ్యక్షత వహించిన సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి యామినేని ఉప్పలరావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన గంధం రాములు ప్రైవేటు ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసి నిరంతరం ఉద్యోగుల కోసం పాటుపడుతున్నారని చెప్పారు. ఆయన చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డును ప్రదానం చేయడం గొప్ప విశేషమన్నారు. గంధం రాములకు మనమంతా అండగా నిలువాలని వారు సూచించారు. ఈ సభలో నాయకులు కలకోటి సత్యనారాయణ, సంగీతం రాజలింగం, రోజారాణి, పుష్ప, తులసీ, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గంధం రాములను సత్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

చీరలు పంపిణీ చేస్తున ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

మహిళలకు చీరెల పంపిణీ

సంజీవరెడ్డినగర్, మే 15, ప్రభాతవార్త: పేదలకు శ్రీనివాస సమాజ సేవ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం సనత్‌నగర్‌లోని బీకేగూడ పార్క్ వద్ద ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మహిళలకు తలసాని శ్రీనివాస్‌యాదవ్ చీరలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేసవి కాలంలో పేదలకు ఉచిత భోజనం అందిస్తూ ఆకలి తీర్చడం, చలివేంద్రం ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం గొప్ప సేవా కార్యక్రమమన్నారు. మదర్స్ డే సందర్భంగా పేద మహిళలకు చీరలను పంపిణీ చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ పార్థసారధి, మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కొలన్ బాల్‌రెడ్డి, హన్మంతరావు, మాణిక్‌రావు పాటిల్, రాంమూర్తి, కృష్ణారెడ్డి, విఠల్‌రెడ్డి, నాయకులు అశోక్ యాదవ్, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

జలమండలి అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దర్శన్ తదితరులు

కార్వాన్, మే 15(ప్రభాతవార్త) : జియాగూడ డివిజన్‌లో తాగునీటి లోప్రెషర్‌తో ప్రజలు ఇబందులు పడుతున్నారని మాజీ కార్పొరేటర్ బోహిని దర్శన్, నవ భారత సంఘం మాజీ అధ్యక్షుడు మదిర సత్యనారాయణ కలసి హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజ్ బోర్డు మేనేజింగ్ డైరెక్టర్ కె.అశోక్‌రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జియాగూడ డివిజన్‌లోని 40 బస్తీల్లో తాగునీటి లోప్రెషర్ సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మంగలహాట్, పురానాపూల్‌లో కొందరు నీటి వాల్స్‌ను ఇతర ప్రాంతాలకు అక్రమంగా వదలడం వల్ల జియగూడ డివిజన్‌కు తాగునీటిలో లోప్రెషర్ సమస్య ఉత్పన్నం అవుతుందని తెలిపారు. నీటి సరఫరా మెరుగుపరచి, కలుషిత నీటి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. జలమండలి ఎం.డి కె.అశోక్‌రెడ్డి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నాందరి నటరాజ్, శ్రీనాద్‌గౌడ్ పాల్గొన్నారు.

వెస్ట్ మారేడ్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపి ఈటల రాజేందర్

కంటోన్మెంట్, మే 15 ప్రభాతవార్త: మురికివాడల్లో నివాసం ఉంటున్న పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. బిజెపి, ఓబీసీ కన్వీనర్ పిట్ల నాగేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు వారికి తగిన తోడ్పాటును అందించాలన్నారు. కార్యక్రమంలో మోండా డివిజన్ మాజీ కార్పొరేటర్ కొంతం దీపిక పాల్గొన్నారు.

క్రీడాకారులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

స్కేటింగ్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థి సాత్విక్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, మే 15 ప్రభాతవార్త: చిన్న వయసులోనే జాతీయ స్థాయి ఐస్ స్కేటింగ్‌లో బంగారు పతకాలు సాధించడం కంటోన్మెంట్‌కు గర్వ కారణమని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల డెహ్రాడూన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి స్కేటింగ్ పోటీల్లో కంటోన్మెంట్ 3వ వార్డు అన్నానగర్ ప్రాంతానికి చెందిన శ్రీను కుమారుడు మాస్టర్ సాత్విక్ 2 బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా శుక్రవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సాత్విక్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులకు తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహించడం ప్రభుత్వ లక్ష్యమన్నారు.

మహిళలకు రక్షణగా షీ టీమ్స్

హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త : నగరవ్యాప్తంగా మహిళలు, బాలికల రక్షణ, గౌరవాన్ని కాపాడటానికి షీటీమ్స్ నిరంతం ప్రయత్నాలను కొనసాగిస్తున్నాయి. ఈ నెలలో, వాట్సాప్, నేరుగా వచ్చిన పిటిషన్లు,సామాజిక మాధ్యమాల అందిన ఫిర్యాదులపై షీ టీమ్స్ చురుగ్గా స్పందించి, రెండు వేధింపుల కేసులలో నిందితులకు విజయవంతంగా శిక్ష పడేలా చేశాయి. ఈ రెండు కేసులలోనూ, నిందితులు మహిళలకు పదే పదే ఫోన్ కాల్స్ చేస్తూ, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులకు గురిచేస్తూ బాధితులకు తీవ్ర మానసిక ఆందోళన, ఇబ్బందులు కలిగించారు. నిందితులను నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ముందు హాజరుపరచగా, వారికి శిక్ష ఖరారైంది. నిందితుల వివరాలు: కరీంనగర్‌కు చెందిన చింతలపల్లి లక్ష్మారెడ్డి కుమారుడు చింతలపల్లి నవీన్‌రెడ్డి (30) తనకు పరిచయం ఉన్న ఒక మహిళను పదే పదే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు బ్లాక్‌మెయిలింగ్‌తో వేధింపులకు గురిచేసినట్లు నిరూపితమైంది.షీటీమ్స్ అధికారులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఇతని ప్రవర్తనలో మార్పు రాలేదు. దీంతో అతన్ని అదుపులోకి తీసుకొని కేసు నమోదుచేశారు. అలాగే లంగర్‌హౌస్‌కు చెందిన గడప రాజన్న కుమారుడు గడప నరేష్(28) అపరిచిత మహిళలను ఫోన్ కాల్స్,ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులకు గురిచేసినట్లు నిరూపితమైంది. మహిళలకు వారి అనుమతి లేకుండా నిరంతరం సందేశాలు పంపుతూ, వారిని ఇబ్బందిపెడుతూ, భయాందోళనలకు గురిచేశాడు. ఇతనిపై కేసు నమోదుచేశారు. ఈ నిందితులిద్దరినీ దోషులుగా నిర్ధారిస్తూ నాంపల్లిలోని ప్రత్యేక జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు చెరో రెండు రోజుల సాధారణ జైలుశిక్ష ప్రతి ఒక్కరికీ రూ.1,050 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారు. ఆన్‌లైన్ వేధింపులు, స్టాకింగ్, బ్లాక్‌మెయిల్ లేదా అసభ్యకరమైన సంభాషణలు ఎదురైతే వెంటనే షీ టీమ్స్ హెల్ప్‌లైన్ లేదా అధికారిక సామాజిక మాధ్యమాల ద్వారా నివేదించాలని హైదరాబాద్ షీ టీమ్స్ కోరింది. ఏ రూపంలోనైనా మహిళలను వేధించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన దృశ్యం

పెట్రోలియం ఉత్పత్తుల పెంపుతో భగ్గుమన్న వామపక్షాలు

ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో పెద్దఎత్తున ఆందోళన

చిక్కడపల్లి, మే 15 (ప్రభాతవార్త) : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం శుక్రవారం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేస్తూ సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం గోల్కొండ చౌరస్తా నుండి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యురాలు టి జ్యోతి మాట్లాడుతూ 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెట్రోల్, డీజిల్ నిల్వలు దేశంలో అపారంగా ఉన్నాయని ధరలు పెంచమని కేంద్ర బీజేపీ ప్రభుత్వం తెలియజేసిందని కానీ ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన అనంతరం పెట్రోల్ పైన 3 రూపాయలు, డీజిల్ పైన 3 రూపాయలు ధరలు పెంచి పేద, మధ్యతరగతి ప్రజల నడ్డి విరిచిందని విమర్శించారు. డీజిల్ ధరలు పెరగడం వలన నిత్యవసర సరుకులు ధరలు పెరిగే ప్రమాదం ఉందన్నారు. సిపిఐ ఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరల వల్ల ప్రజలపైన నెలకు రూ.3600 కోట్లు, సంవత్సరానికి 43 వేల కోట్లు అదనపు భారం పడుతున్నదన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.మహేందర్, ఎం.దశరథ్ లతోపాటు నగర కమిటీ సభ్యులు ఆర్, వెంకటేష్, జె. కుమారస్వామి, ఎన్. మారయ్య, వై. వరలక్ష్మి, కె. అజయ్ బాబు, ఆర్. అశోక్, జి. నరేష్, జి. కిరణ్, ఎం. అజయ్ బాబు, కె.అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

నిజాంపేట్, మే 15, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి లో అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన ఆనంద్‌రావు, ఇప్పిలి వెంకట్రావు, మహమ్మద్ రహీముద్దీన్, వాణి, కాముని నగేష్ కుటుంబాలకు మంజూరైన మొత్తం రూ.3 లక్షల 40 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి అనేది మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో ఊరటనిచ్చే గొప్ప పథకమని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో చికిత్స పొం దిన పేద ప్రజలు సంబంధిత వైద్య రసీదులను తమ కార్యాలయంలో అందజేసి ముఖ్యమంత్రి సహాయనిధిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజాపాలన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయరాం, డీసీసీ కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ బొబ్బ రంగారావు, చౌద శ్రీనివాస్, నాగిళ్ల శ్రీనివాస్, శ్యామ్, నర్సింగ్, మురళి, సంపత్ గౌడ్, డాన్ శీను తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు

చాంద్రాయణగుట్ట, మే 15, ప్రభాతవార్త : తప్పిపోయిన బాలికను(9) పోలీసులు క్షేమంగా వెతికిపట్టి తల్లిదండ్రులకు అప్పగించారు. ఛత్రినాక పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇన్‌స్పెక్టర్ బి.కోటేశ్వరరావు తెలిపిన ప్రకారం.... కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన మహనంద కూతురు సిద్ధేశ్వరి ఎలియాస్ సంజనతో(9)తో కలిసి ఉప్పుగూడ అంబికానగర్‌లోని బంధువుల ఇంట్లో శుభకార్యానికి వచ్చింది. ఆమె కూతురు సంజన ఆడుకుంటూ వెళ్లి దారితప్పింది. ఓ ప్రాంతంలో ఏడ్చుకుంటూ ఒంటరిగా ఉండగా గమనించిన స్థానికులు డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు సిబ్బందిని పురమాయించారు. బాలికను కనుగొన్న పోలీసులు ఆమెను ఓదార్చి, ధైర్యవచనాలు పలికారు. చుట్టుపక్కల వారిని విచారించగా ఆమె తల్లి మహనందగా గుర్తించారు. తల్లి తెలిపిన వివరాలతో సంతృప్తి చెందిన పోలీసులు సంజనను క్షేమంగా అప్పగించి మార్గదర్శనం చేశారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి : ఎసిపి

కంటోన్మెంట్, మే 15 ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రైవర్లు రోడ్డు భద్రతా సూత్రాలను పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ రాహుల్ రెడ్డి ఆదేశాలమేరకు శుక్రవారం బోయిన్‌పల్లి మార్కెట్ డ్రైవర్లతో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. డ్రైవర్లు మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని,సీట్ బెల్ట్ తప్పని సరిగా ఉపయోగించాలని, ద్విచక్రవాహన దారులు హెల్మెట్‌ను ధరించాలని సూచించారు. డ్రైవర్లు రోడ్డు భద్రతా సూత్రాలు పాటిస్తూ ఏకాగ్రతతో డ్రైవింగ్ చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశాలుంటాయన్నారు. ఈ సందర్భంగా 30 సంవత్సరాల నుంచి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా డ్రైవింగ్ చేస్తున్న ఉత్తమ ఆటో డ్రైవర్ రమణయ్యను ఏసీపీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసి అఖిలభారత వడ్డెర సంఘం

చైర్మన్ గుంజ రేణుక నారాయణలను సన్మానిస్తున్న మైసయ్య తదితరులు

హైదరాబాద్, మే 15, ప్రభాతవార్త: రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గుంజ రేణుక నారాయణను శుక్రవారం అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. చైర్మన్‌ను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు దండుగుల మైసయ్య, జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, జాతీయ యువజన అధ్యక్షుడు డా.లోకేష్ వేముల ,జాతీయ కార్యదర్శి మక్కల శేఖర్,జాతీయ ప్రధాన కార్యదర్శి వరికుపాల శ్రీనివాస్, జాతీయ మహిళా అధ్యక్షురాలు తిరుమల దేవి, రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజుల, సంపంగి వెంకటేష్, వల్లేపు వెంకటేష్,పల్లాపు సారంగపాణి,గోగుల స్వామి తదితరులు ఉన్నారు.

వైకుంఠ దామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకశ్రద్ధ : ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్, మే 15 ప్రభాతవార్త : వైకుంఠ దామాల అభివృద్ధిద్వారా ప్రతిఒక్కరి చివరి మజిలీని గౌరవప్రదంగా నిర్వహించేలా చేపట్టవలసిన ప్రహారీగోడలు, వాష్‌రూమ్‌ల నిర్మాణం, వాచ్‌మెన్ రూము, దహన వాటికల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయటమే లక్ష్యంగా పనిచేయాలని కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ సూచించారు. చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ రషీదా మహ్మద్‌రఫి, వైకుంఠదామం అభివృద్ధి కమిటీ అధ్యక్షులు దేగల కృష్ణమూర్తి, కార్యదర్శి రెక్కి ప్రేమ్‌కుమార్ (బుల్లెట్‌ప్రేమ్). కుత్బుల్లాపూర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ టి.లక్ష్మారెడ్డి, నాయకులు విద్యాసాగర్, మాజీ కౌన్సిలరు ఇ.వి.సాగర్‌రావు, దొప్పలపూడి సత్యనారాయణ, తెలంగాణ ఉద్యమకారులు సాంభయ్య, స్మార్ట్, రంగా నగర్ సంక్షేమసంఘ అధ్యక్షులు బండారు వరప్రసాద్, మురళి, మహిళా నాయకులు మాజీవార్డు సభ్యులు మెహరున్నిస్సా బేగంల ఆధ్వర్యంలో పనులను పరిశీలించారు. ఈసందర్భంగా పనులను అధికారులు, వైకుంఠదామం కమిటీ ప్రత్యేకశ్రద్ధతో నాణ్యతతో కూడిన పనులను నిర్వహించేలా శ్రద్దచూపాలని శాసనసభ్యులు కె.పి.వివేకానంద్ సూచించారు.

సిఎం ప్రజావాణీలో 334 దరఖాస్తులు

బేగంపేట మే 15,ప్రభాతవార్త : మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 334 దరఖాస్తులు అందాయి. వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 107దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 60,ఇందిరమ్మ ఇండ్ల కోసం 89,ప్రవాసీ ప్రజావాణీకి 03దరఖాస్తులు అందాయి.ఇతర శాఖలకు సంబంధించి 75దరఖాస్తులు అందాయి.సీఎం ప్రజావాణీ ఇంచార్జ్ ,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జి.చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలు పరిష్కరించారు.

విహెచ్‌ను అభినందిస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్

విహెచ్‌ను అభినందించిన మహేష్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా పదవి బాధ్యతలను స్వీకరించిన సందర్భంగా పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే ప్రతి నాయకుడికి తగిన గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. విహెచ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేసే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమిష్టి కృషి అవసరం

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్, మే 15 ప్రభాతవార్త: పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అల్వాల్, వెంకటాపురం డివిజన్లకు చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పార్టీ సభ్యత్వ నమోదుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. సర్ ప్రక్రియలో పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగానికి సహకరించాలని తెలిపారు. భేద్రాభిప్రాయాలను పక్కన పెట్టి ముందుకు సాగాలని పార్టీ అండగా ఉంటుందని ఎంబిసి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వీరేష్‌యాదవ్, వెంకన్న, ఖలీల్, లడ్డు, పరమేష్, సుధీర్, శరణ్ గిరి, విఎన్ రాజు, రాజేందర్, శ్రీనివాస్, లోకేష్, లింగారెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కంటోన్మెంట్, మే 15 ప్రభాతవార్త: పేద ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. కంటోన్మెంట్ బోయిన్‌పల్లి ప్రాంతానికి చెందిన కురుమయ్య అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్.శ్రీనివాస్‌ను సంప్రదించగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి కోటా కింద మంజూరైన రూ.48 వేల సిఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే అందజేశారు.

బండి బగీరథను అరెస్టు చేయాలి

హైదరాబాద్, మే 15 ప్రభాతవార్త : బండి బగీరథ అరెస్ట్ విషయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు రెండు నాటకాలు ఆడుతున్నాయని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సలహాదారు డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. వారం రోజుల క్రితమే పేట్‌బషీరాబాద్‌లో బండి బగీరథపై కేసు నమోదైనా, ఇప్పటివరకు పోలీసు వ్యవస్థ అతడిని అరెస్ట్ చేయడంలో విఫలమైందని ఆరోపించారు. కొన్ని రోజుల పాటు మోదీ పర్యటన కారణమని చెప్పి, ఇప్పుడు ఆచూకీ దొరకడం లేదని చెప్పడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు. బీజేపీ సోషల్ మీడియా బాధిత యువతిపై ఫొటోలు విడుదల చేయడం, ఆమె వ్యక్తిత్వాన్ని దూషించడం, కుటుంబాన్ని విమర్శించడం వంటి చర్యలు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉన్నాయన్నారు. ఇన్ని రోజులు అరెస్ట్ చేయకుండా కాలయాపన చేయడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానం ప్రజల్లో బలపడుతోందని, దీనివల్ల కాంగ్రెస్–బీజేపీ కుమ్మక్కయ్యాయనే సందేహం పెరుగుతోందన్నారు.బండి బగీరథను తక్షణం అరెస్ట్ చేయకపోతే, ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలు ప్రజాసంఘాలతో కలిసి ముఖ్యమంత్రి నివాసాన్ని ముట్టడించి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డాక్టర్ దిడ్డి సుధాకర్ హెచ్చరించారు.

ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడేవారిపై చర్యలు తీసుకోవాలి

సైఫాబాద్, మే 15 ప్రభాతవార్త: గత 9 సంవత్సరాలుగా తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పేరుతో పని చేస్తుంటే కొంతమంది తమ ఫోరం పేరుమీద ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఫోరం ఛైర్మన్ డాక్టర్ చీమా శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఫోరం ప్రతినిధులు శుక్రవారం రాష్ట్ర డిజిపికి వినతి పత్రాన్ని సమర్పించామని ఆయన తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆ వ్యక్తులు గత రెండు నెలలుగా ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడటంతో తమ ఫోరం సభ్యులు అరెస్టు అవుతున్నారని, ఇలాంటి చర్యలు తిరిగి పునరావృత్తం కాకుండా విచారణ జరిపి ఆ వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, ఆ ఫోరాన్ని రద్దు చేయాలని కోరారు. వారు కరీంనగర్‌లో ఫోరంను రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రజాభవన్, సచివాలయం ముట్టడి వంటి కార్యక్రమాలకు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో ఫోరం ప్రతినిధులు నాగజ్యోతి, జగన్ యాదవ్, మంజుషా, దయనంద్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం
మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్
సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్
'ఇ'- ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

NIT No. 12/SE(M)/మల్కాజ్‌గిరి జోన్/MMC/2026-27 తేది: 14.05.2026

క్ర.సం.1. నిట్ నెం.: పైన పేర్కొన్నది. పనుల సంఖ్య: 03 పనులు. అంచనా మొత్తం : (రూ.లక్షలలో): 278.00. మొత్తం 03 పనులు 278.00. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/వివరి తేదీలు, సమయం: బిడ్ దాఖలు ప్రారంభ తేదీ, సమయం: 16.05.2026, మ.1.00గం. బిడ్ దాఖలు ముగింపు తేదీ, సమయం: 23.05.2026 మ.1.00గం. అధికారి పేరు, చిరునామా: SE, మల్కాజ్‌గిరి జోన్, MMC. సెల్ నెం: 9154796465. తదుపరి వివరాలు https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. సూపరింటెండింగ్ ఇంజనీర్, మల్కాజ్‌గిరి జోన్, MMC.

DIPR.NO. 2444-PP/CL/ADVT/1/2026-27 తేదీ: 15.05.2026

గొలుసుకట్టు చెరువులతో వరదలకు కట్టడి

హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్

హైదరాబాద్, మే 15,ప్రభాతవార్త: "గొలుసుకట్టు చెరువులకు పెట్టింది పేరు మన హైదరాబాద్. లేకిసిటీగా పేరున్న ఈ మహనగరంలో మొత్తం 1384 చెరువులుంటే ఇందులో 625 చెరువుల జాడ కనిపించడంలేదు. ఉన్న 759 చెరువులుకూడా ఆక్రమణలకు గురై కనుమరుగయ్యే ప్రమాదంలో ఉన్నాయి. ఉన్న చెరువులను పరిరక్షి ంచడమే కాకుండా.. కనుమరుగైన చెరువుల జాడ తెలుసుకుని అన్నిటినీ పునరుద్ధరించడమే హైడ్రా లక్ష్యం. గొలుసుకట్టు చెరువుల లింకును తిరిగి అనుసంధానించి వరదల కట్టడికి హైడ్రా కృషి చేస్తోంది. చెరువుల చెంత ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించడమే ప్రభుత్వ లక్ష్యం. ఆ దిశగా హైడ్రా పని చేస్తోంది "అని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. శుక్రవారం "వే2న్యూస్"కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న కమిషనర్ నగర భవిష్యత్తు, చెరువుల పరిరక్షణ, అర్బన్ ఫ్లడింగ్ వంటి కీలక అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఉత్తర ప్రదేశ్‌లోని గాలి వానతో అనేకమంది మృతి చెందారు. పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్నప్పుడే ఇలాంటి ఉపద్రవాలు సంభవిస్తాయి. అందుకే ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. పర్యావరణ హితమైన నగర నిర్మాణం ప్రభుత్వ లక్ష్యం... ఆ దిశగా హైడ్రా ముందుకు సాగుతోంది. వరదల సమస్యకు చెరువులు, నాలాల ఆక్రమణలే ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. ఈ క్రమంలో మొదటివిడతగా 6 చెరువులను అభివృద్ధి చేశాం. మరో 14 చెరువుల అభివృద్ధిని ప్రారంభించాం. నగరం నలుమూలలా ట్యాంక్‌బండ్‌లుండాలనేది ప్రభుత్వ లక్ష్యం ఆ దిశగా.. 4 పెద్ద చెరువులను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. ఇలా చెరువులన్నీ అభివృద్ధి చెంది.. వాటి చెంత పార్కులు, గ్రీనరీ పెరిగితే పర్యావరణహితమైన నగర నిర్మాణం జరుగుతుంది. చెరువుల చెంత పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఓపెన్ జిమ్‌లు పెడుతున్నాం. చెరువు చుట్టూ బండ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని వయసుల వారూ చెరువుల చెంత సేదదీరేలా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. మురికి కూపాలుగా ఉన్న చెరువులు పర్యాటక ప్రాంతాలుగా మారుతున్నాయి.

ఇప్పటికే ప్రారంభమైన అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, పాతబస్తీలోని బమృకున్ ఉద్ దౌలా చెరువులను పరిశీలిస్తే ప్రయోజనాలు అందరికీ అర్థమౌతాయన్నారు. 10 సంవత్సరాల రోడ్‌మ్యాప్‌లో కనీసం 1300 చెరువులను పునరుద్ధరించి అభివృద్ధి చేయగలిగితే భూగర్భ జలాల స్థాయి పెరిగి, పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. వరద కాలువల పునరుద్ధరణను కూడా పెద్దయెత్తున చేపట్టామన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: MEDCHAL-MALKAJGIRI DISTRICT; AT :: MALKAJGIRI
O.S. No. 174 OF 2026

Between:-
Bayapuneni Vidyadhari and another ......Plaintiffs
AND
Bayapuneni Navaratna and others .....Defendants

To,
ALL CONCERNED.

Please take notice that the Plaintiffs herein filed the above suit for legal heirs of the Late Bayapuneni Aruna before the Hon'ble Principal Senior Civil Judge, Medchal Malkajgiri District, at Malkajgiri for the suit scheduled property of the deceased, i.e., all that residential property of Ground + 3 House bearing H.No.6-29 / 1, Plot No.108 (Part B) admeasuring area 310 Sq. Yards, Situated at Sri Venkata Sai Nagar Colony, Venkatapuram under GHMC Alwal Circle, Alwal Mandal, Medchal-Malkajgiri District, and bounded by: NORTH: Neighbours House, SOUTH: 25' Wide Road, EAST: Neighbours House, WEST: Neighbours House. Therefore, the General Public are hereby informed that if any person or persons have got any objection or interest should appear and file the same before the above said Hon'ble Court on 08/06/2026 at 10:30 AM through counsel or in person failing which the matter will decided on merits.

// BY ORDER OF THE COURT //
Sd/-
M. RAVI PRAKASH REDDY
Advocate
M/S. KOTA LAW ASSOCIATES
H.No. 40-254/ 1/ 1, Raghavendra Nagar, Moula-Ali, Hyd - 40.
Cell No. 98493 25055

IN THE COURT OF THE HON'BLE, V ADDL.JUNIOR CIVIL JUDGE HYDERABAD DISTRICT; AT :: HYDERABAD.
O.S. No. 1415 Of 2026

BETWEEN:-
Mr. Bhima Razu Prasad& others ......Plaintiffs
AND
The Tahsildar & others .....Defendants

To
All Concerns .....Defendants

Please take notice that the plaintiff 1) Mr. Bhima Razu Prasadhave instituted the above suit for To Declare the Legal Hairs as Late Smt. B.Usha Prasad and the same is posted to 24.06.2026 at 10.30 A.M. if anybody not appeared and filed any objection before the Hon'ble Court on 24.06.2026 at 10.30 A.M. the matter will decided on merits.

// BY ORDER OF THE HON'BLE COURT //
CHARVIK LAW ASSOCIATES
T. SWAMI
Advocate
#H. No. 6-84/167/W, Pragathinagar Colony, Dammaiguda, Keesara Mandal, M. M. District - 500083
Date: 14.05.2026.

IN THE COURT OF THE HON'BLE PRINCPLE JUNIOR CIVIL JUDGE: MEDCHAL & MALKJGIRI AT: KUSHAIGUDA.
O.S.NO. 323 OF 2026

Between: -
1) B. JALAJA MALIKA, W/o Late Jagan Mohan, aged about 61 years, Occupation: House Wife,
2) B. J. VIVEKANANDA, S/o. Late Jagan Mohan, aged about 43 years, Occupation: Private Employee,
3) BADE MAMATHA, D/o. Late Jagan Mohan, W/o B. Mallesham, aged about 42 years, Occupation: House Wife, R/o H.No. 1-5-1053/122/109, Sai Baba Nagar, Prakruti Elite Apartments, Old Alwal, Hyderabad-10.
The above 1 and 2 are Permanently, resident of R/o. H.No. 1-10-119, Temple Alwal, Opposite Telephone Exchange, Alwal, Bolarum PO, Hyderabad - 10.
...PLAINTIFFS
And
1) The Tahsildar, Alwal Mandal & Municipality, Medchal & Malkajgiri District.
2) All Concerned
...DEFENDANT Nos. 1 & 2

PUBLICATION

Please take that the above-named petitioners have filed above suit for declaration of legal heirs of the deceased B. JAGAN MOHAN Died on 19/10/1995. The said petition was posted on 11/6/2026 for any objections over the petition and for appearance. Your requested to be present before the above-mentioned court on 11/6/2026 at 10.30 a.m. in person or through an advocate. Failing which you will be set exparte, and petition will be proceeded against you in your absence.

By order of court
S. ARUN SATYA PRASAD
Advocate
Secunderabad. PH: 8008059359.
Counsel for plaintiffs.

సమాజ అభివృద్ధిలో మహిళలది కీలక పాత్ర : సబితా ఇంద్రారెడ్డి

మహిళామండలి భవనాన్ని ప్రారంభిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

హుడాకాంప్లెక్స్,15 మే, ప్రభాతవార్త : సమాజ అభివృద్ధిలో మహిళలది కీలక పాత్రయని మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం శాసన సభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సరూర్‌నగర్ డివిజన్ పరిధి, హుడాకాంప్లెక్స్ లో నూతనంగా నిర్మించిన స్ఫూర్తి మహిళా మండలి భవనాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మట్లాడుతూ ముగ్గురు మహిళలతో ప్రారంభమైన స్ఫూర్తి మహిళా మండలి దినదినాభివృద్ధి చెందుతుందని అభినందించారు. మహిళా మండలి అధ్వర్యంలో పేద వెనుక బడిన విద్యార్థులకు సహకారం అందించాలని కోరారు. హుడాకాంప్లెక్స్ లో స్విమింగ్‌పూల్ నిర్మాణానికి కృషి చస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ సహకారం లేకపోవడంతో మహిళా భవన నిర్మాణం అలస్యమైదని తెలిపారు. రాబోయే కాలంలో మన ప్రభుత్వం వస్తుందని పెండింగ్ పనులు అన్ని పూర్తిచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి మహిళా మండలి అధ్యక్షురాలు సి. హెచ్. దుర్గాదేవి,ప్రధాన కార్యదర్శి పి. రాజ శ్రీదేవి, కోశాధికారి వి.పద్మజ, విజయలక్ష్మి, శ్యామల, లీలా రాజశేఖర్, కె.రమాదేవి స్థానిక నాయకులు ఇంటూరి అంకిరెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి, దర్పల్లి అశోక్, ధనమ్‌రెడ్డి,మల్లారెడ్డి, రాజ్‌కుమార్‌గుప్తా, చంద్రశేఖర్,సప్పిడి గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యం.డి.సలీం, రిషి, ప్రత్యుష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రాంనగర్ కాలనీ అభివృద్ధికి కృషి : లచ్చిరెడ్డి

వనస్థలిపురం. మే 15.ప్రభాతవార్త.
బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు నూతన కమిటీ ఏర్పాటైన బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి కాలనీ అభివృద్ధి మరియు సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలని కోరారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీలో 90 శాతం వరకు పనులన్నీ పూర్తి చేయడం జరిగిందని మరికొన్ని రోజులలోనే పూర్తి స్థాయిలో కాలనీ అభివృద్ధి మరియు సమస్యలు పరిష్కారం చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాము గౌడ్, ట్రెజరర్ శేఖర్, గౌరవ అధ్యక్షులు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు పుష్పాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రవీందర్ రెడ్డి, రాకేష్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కృష్ణారెడ్డి, దయానంద్ గౌడ్, అడ్వైజర్స్ రంగారెడ్డి, రవీందర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్ మరియు తదితరులు ఉన్నారు.

కమ్యూనిటీ శిశు డేకేర్ సెంటర్లను సద్వినియోగం చేసుకోవాలి: ఎండి దివ్య దేవరాజన్

కమ్యూనిటీ శిశు డే కేర్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మేమ్మ ఎండి దివ్య దేవరాజన్, యుసిడి జాయింట్ కమిషనర్ దేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సలాం షాహిద్ తదితరులు

మలక్ పేట, మే 15, ప్రభాతవార్త:
ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేమ్మ ఎండి దివ్య దేవరాజన్ పేర్కొన్నారు. మలక్ పేట్ నియోజకవర్గం చంచల్ గూడా పిల్లి గుడిసెలు డబుల్ బెడ్ రూమ్ సముదాయం ఆవరణలో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ సెంటర్ ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగాలు చేసే తల్లిదండ్రులు తమ పిల్లలను డే కేర్ సెంటర్ లో అప్పగిస్తే పిల్లల సంరక్షణను చూసుకోవడం జరుగుతుందని వివరించారు. సుమారు 7 నెలల వయసు నుంచి 6 సంవత్సరాలలోపు వయస్సు గల పిల్లలను డే కేర్ సెంటర్ లో అప్పగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి యూసిడి జాయింట్ కమిషనర్ దేవేందర్ రెడ్డి, మలక్ పేట్ యుసిడి ప్రాజెక్ట్ ఆఫీసర్ పద్మ, యూసిడి పిఒలు నరసింహ, రవి, అలివేలు, రామకృష్ణ, వీఆర్పీ నరసింహ పాల్గొన్నారు.

సాయిబాబా దేవాలయం అభివృద్ధికి కృషి : చైర్మన్ రాంకోటేశ్వరరావు


సాయిబాబా దేవాలయం చైర్మన్ వెమురి రాం కోటేశ్వరరావు ను సన్మానిస్తున్న చౌకి రవికుమార్ తదితరులు

మలక్ పేట, మే 15, ప్రభాతవార్త: మలక్ పేట మున్సిపల్ కాలనీలోని సాయిబాబా దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని దేవాలయం చైర్మన్ వెమురి కోటేశ్వరరావు పేర్కొన్నారు. సాయిబాబా దేవాలయం 14వ వార్షికోత్సవం సందర్భంగా దేవాలయంలో పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోచమ్మ దేవాలయం వైస్ చైర్మన్ చౌకి రవికుమార్ ఆధ్వర్యంలో రాం కోటేశ్వరరావు ను శాలువతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటికొండ శ్యామ్, పందిరి రాము, రాజేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని పివిఎన్ కాలనీలో సుమారు 16 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులను మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఎస్ఆర్ ప్రసాద్ బాబు సత్యనారాయణ సంపత్ రావు శ్రీనివాస్ కాలనీ అసోసియేషన్ సభ్యులు శ్రీకాంత్, చైతన్య, సురేష్, అరుణ, మాణిక్యరావు, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు

ప్రతిభ పతాక ఎగరేసిన విద్యార్థులు..

వంద శాతం ఫలితాలతో మరోసారి విద్యాసంస్థకు కీర్తి
నేరేడ్ మెట్ , మే 15,ప్రభాతవార్త :
ఆర్మీ పబ్లిక్ స్కూల్ ఆర్ కె పురం మరోసారి విద్యా ప్రతిభకు చిరునామాగా నిలిచింది. కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నిర్వహించిన ఇంటర్మీడియట్ సమాన తరగతి పరీక్షల్లో ఈ విద్యాసంస్థ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కనబర్చి శాతం వంద ఫలితాలను నమోదు చేశారు. కేవలం ఉత్తీర్ణతతోనే కాకుండా 17 మంది విద్యార్థులు పూర్తి మార్కులు సాధించడం విశేషంగా నిలిచింది.పాఠశాల విద్యా ప్రమాణాలు, ఉపాధ్యాయుల అంకితభావం, విద్యార్థుల కృషి మరోసారి ఫలితాల్లో ప్రతిఫలించాయి. పరీక్షల్లో యశ్వి గ్రేవాల్ 97.6 శాతం మార్కులతో అగ్రస్థానంలో నిలిచి విద్యాసంస్థకు గర్వకారణమయ్యారు. ఆర్. విశాలి 96 శాతం మార్కులతో ద్వితీయ స్థానం సాధించగా, ఆదిత్య త్రిపాఠి 94.8 శాతం, గ్లోరియా ఫెర్నాండెజ్ 94.4 శాతం, సుమీత్ కుమార్ 94.2 శాతం మార్కులు సాధించి ప్రతిభ చాటారు.విభాగాల వారీగా కూడా విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చారు. సైన్స్ విభాగంలో యశ్వి గ్రేవాల్ అగ్రస్థానంలో నిలవగా, మానవీయ శాస్త్ర విభాగంలో రీనా ముఖర్జీ 93.8 శాతం మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారు. వాణిజ్య విభాగంలో ఎం. అక్షయ పూజా 90.6 శాతం మార్కులతో ప్రతిభ కనబర్చారు.ఈ సందర్భంగా విద్యాసంస్థ చైర్మన్ బ్రిగ్ శైలంద్ర సింగ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, కఠోర శ్రమ, లక్ష్యసాధనతో ఈ ఘనత సాధించారని అభినందించారు. విద్యార్థుల విజయాలు విద్యాసంస్థ ప్రతిష్ఠను మరింత పెంచాయని పేర్కొన్నారు.ప్రధానోపాధ్యాయురాలు అర్చన రాయ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి విజయంలో ఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల సహకారం, విద్యార్థుల పట్టుదల ప్రధాన పాత్ర పోషించాయని తెలిపారు. ఫలితాలు చూసి విద్యాసంస్థ గర్వంగా ఉందని, భవిష్యత్తులోనూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయోత్సాహంతో విద్యాసంస్థ ప్రాంగణం ఆనందోత్సాహాలతో కళకళలాడింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ వారి భవిష్యత్తు విజయవంతంగా ఉండాలని ఆశీర్వదించారు

జనగణన ప్రక్రియను పరిశీలించిన జోనల్ కమిషనర్ చంద్రకళ...

తుర్కయంజాల్, మే 15 (ప్రభాతవార్త)
జనగణన కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాట్లు లేకుండా నిర్ణీత గడువులో పూర్తి చేయాలని శంషాబాద్ జోనల్ కమిషనర్ చంద్రకళ అధికారులను ఆదేశించారు. మే 11వ తేదీ నుంచి ప్రారంభమైన జనగణన కార్యక్రమం పురోగతిని శుక్రవారం ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్ డివిజన్‌లో ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుర్కయంజాల్ డివిజన్‌లోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీలలో కొనసాగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించిన కమిషనర్, ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు రూపొందించిన మ్యాప్లు, హౌస్ లిస్టింగ్ నెంబర్లను పరిశీలిస్తూ సమాచార సేకరణలో ఖచ్చితత్వం పాటించాలని సూచించారు.ప్రతి ఇంటి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమన్వయంతో పని చేయాలని, ప్రభుత్వానికి సరైన గణాంకాలు అందేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.అనంతరం పలు కాలనీలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కూడా జోనల్ కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక వసతులు, పనుల పురోగతి వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించి అవసరమైన సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణ రెడ్డి, శానిటేషన్ ఏఈ యోగేందర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సెన్సెస్ సూపర్వైజర్లు, ఎన్యుమరేటర్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హబ్సిగూడలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

హబ్సిగూడ డివిజన్ బిఆర్ఎస్ సన్నాహాక సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

ఉప్పల్, మే 15 ప్రభాతవార్త : బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఉమ్మడి హబ్సిగూడ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బోగోజు వెంకటచారి, మాజీ ప్రధాన కార్యదర్శి కంచర్ల సోమిరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు సన్నాహాక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితోపాటు, పార్టీ సీనియర్ నేతలు పసుల ప్రభాకర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చెంచల లక్ష్మినారాయణ, వి యాదగిరి,బి. కైలాసపతి గౌడ్, పార్టీ సీనియర్ నేత కాలేరు జై నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు చేపట్టామని, ఆన్‌లైన్‌లో చేపట్టే ఈ సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. గతంలో సుమారు 40వేలకుపైగా సభ్యత్వం చేశారని, ఈ ఏడాది 60వేల వరకు చేయాలని సూచించారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగు గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను వివరించారు. పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. పార్టీకి ప్రజల్లో ఉన్న ఆదరణను మరింత పెంచేందుకు సభ్యత్వ నమోదు కార్యక్రమం కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేతలు గంధం నాగేశ్వర్‌రావు, వీరేందర్, యకాంతరావు, మేకల శ్రీనివాస్, మనోహర్, సంజయ్‌జైన్, నరేందర్, మహిళా అధ్యక్షురాలు యాదమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపులతో మానసిక వికాసం, సృజనాత్మకత పెంపొందుతుంది : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సమ్మర్ క్యాంపును ప్రారంభించి ప్రసంగిస్తున్న సబితా ఇంద్రారెడ్డి

సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త: సమ్మర్ క్యాంపుల వల్ల విద్యార్థుల్లో మానసిక వికాసం, సృజనాత్మక పెంపొందుతుందని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్ ప్రశాంతిహిల్స్ డివిజన్‌లో శుక్రవారం బీ ద ఛేంజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ విద్య, కోడింగ్, రోబోటిక్స్, ఎఐ తదితర వాటిల్లో శిక్షణనిచ్చేందుకు ఏర్పాటు చేసిన సమ్మర్ కోచింగ్ క్యాంపును ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఇలాంటి ఉపయోగకరమైన కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం నింపినట్లు అవుతుందని ఆమె పేర్కొన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వివిధ రంగాల్లో శిక్షణనివ్వడం వారికి మున్ముందు ఎంతో ఉపయోగపడుతుందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరు

సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా చెక్కులు అందుకుంటున్న లబ్ధిదారులు

సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త: అనారోగ్యాలకు గురైవైద్య చికిత్సల కోసం సిఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసిన పలువురికి మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో చెక్కులు మంజూర య్యాయి. ఈ నేపథ్యంలో సత్యసాయినగర్‌కు చెందిన ముదిగొండ అంజయ్య, పాశ్ కాలనీకి చెందిన పార్వతమ్మ, నోముల అనిత తదితరులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రిలీజ్ కాగా వాటిని శుక్రవారం వారి కుటుంబ సభ్యులు సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా వారు సిఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందించినందుకు సబితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాదరి రమేష్, జె.శ్రీనివాస్ నాయక్, ఎనుగుల అనిల్‌కుమార్ యాదవ్, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, సౌందర్య విజయ్, నిర్మలారెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర గ్రంథాలయంలో విద్యా వారోత్సవాలు

గ్రంథాలయ పాఠకులను సన్మానించిన రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదనరెడ్డి

సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త:
ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహి స్తున్న విద్యా వారోత్సవాల సంద ర్భంగా బడంగ్‌పే ట్‌లోని రంగారెడ్డి జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో శుక్రవారం ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన గ్రంథాలయ పాఠకులైన పలువురికి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి ప్రభు త్వ ఉద్యోగ సాధకులైన మహేష్‌గౌడ్ (డిఎస్‌పి), మహేష్ కృష్ణ (ఎఎస్‌ఒ), దివ్య (సోషల్ వెల్ఫేర్), దీపక్, ఎస్.అనిత, సాయికిరణ్ తదితరులను శాలువాలతో సత్కరించి అభినం దించారు. జిల్లా కార్యదర్శి జివి రాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిఇఒ సుశీంద్రరావు, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ ఛైర్మన్ కావలి చంద్రశేఖర్, గ్రంథాలయ సిబ్బంది సత్యనారాయణ, జైహింద్, శరత్‌కుమార్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ నీలకంఠేశ్వర స్వామికి ఘనంగా మల్లికాపుష్పార్చన పూజలు

గౌరీ నీలకంఠేశ్వర స్వామికి మల్లికాపుష్పార్చన నిర్వహిస్తున్న భక్తులు

సరూర్‌నగర్, మే 15 ప్రభాతవార్త: మీర్‌పేట్ శివసాయినగర్‌లోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా మల్లికాపుష్పార్చన పూజలు ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం తెల్లవారు జాము నుండే ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా లఘున్యాస పూర్వక ఏకవార రుద్రాభిషేకాలు జరిపారు. అనంతరం మల్లికా పుష్పాలతో అర్చనను కనుల పండువగా నిర్వహించారు. తదుపరి రుద్ర హోమం, నవగ్రహ సహిత మహా మృత్యుంజయ హోమం జరిపారు. నోరి సత్యనారాయణ శర్మ, సాంబశివ శర్మ, శ్రీనివాస్ ప్రసాద్, లక్ష్మీ గణపతిరావులు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మీర్‌పేట్ శ్రీ గాయత్రీ సేవా సంఘం, సనాతన ధర్మ ప్రవర్ధక సమితి సభ్యులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : ఎన్వీఎస్ఎస్

సెంట్రింగ్ కార్మికుల సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

ఉప్పల్, మే 15 ప్రభాతవార్త : సెంట్రింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఉప్పల్ అసెంబ్లీకి చెందిన సెంట్రింగ్ యూనియన్ కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులలో భాగమైన సెంట్రింగ్ పనులకు గిట్టుబాటు ధర అవ్వడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని సెంట్రింగ్ యూనియన్లు కలసి ఈనెల తేదీ 16 నుంచి నెల రోజులపాటు పనులు నిలిపివేస్తున్నారని తెలిపారు. వీరికి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామంతపూర్ డివిజన్ బిజెపి అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ నెంబర్ తాళ్ల బాలకృష్ణ గౌడ్, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ రేవు నరసింహ, రేవు కృష్ణయ్య, బిజెపి సీనియర్ నాయకుడు శాగ రవి, రావుల బీరప్ప పలువురు సెంట్రింగ్ కార్మికులు పాల్గొన్నారు.

జనగణన ప్రక్రియ నమోదుపై సమీక్ష

జనగణన ప్రక్రియ నమోదుపై సమీక్ష నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

ఉప్పల్, మే 15 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ఉప్పల్, కాప్రా సర్కిల్‌లలో జనగణన ప్రక్రియ నమోదుపై జోనల్ కమిషనర్ రాధిక గుప్తా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, సూపర్‌వైజర్లు,మరియు ఎన్యూమరేటర్లతో కలిసి ఫీల్డ్ స్థాయిలో జరుగుతున్న జనగణన ప్రక్రియను పరిశీలించారు.హౌస్ లిస్టింగ్ బ్లాక్స్ పురోగతి, ఫీల్డ్ స్థాయిలో ఎన్యూమరేషన్ పనితీరు మరియు డేటా సేకరణ ప్రక్రియపై సమీక్ష నిర్వహించి, పనులు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. జనగణన ప్రక్రియ నమోదులో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితురాలికి ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసీ పత్రాన్ని అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ పన్నాల

నాచారం, మే 15: ప్రభాతవార్త :
నర్సింహ్మనగర్ కాలనీకి చెందిన అనురాధకు ఎమ్మెల్యే బిఎల్ఆర్ శుక్రవారం ఎల్ఓసి అందజేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి ఆదేశాల మేరకు మల్లాపూర్ డివిజన్ నర్సింహ నగర్ కాలనీకి చెందిన కె. అనురాధ అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రూ.2 లక్షల ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను వారి కుటుంబ సభ్యులకు మల్లాపూర్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్ చారి, చిగుళ్ల మల్లేష్, ఎస్వీ శ్రీనివాస్, బొత్స శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాజ్ ఆచార్యకు డికేడ్ ఆఫ్ సర్వీస్ అవార్డు

నేరేడ్ మెట్ , మే 15, ప్రభాతవార్త:
తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మెడ్చల్ జిల్లా అధ్యక్షులు, ప్రముఖ సైకాలజిస్ట్ రాజ్ ఆచార్యకు ప్రతిష్టాత్మక డికేడ్ ఆఫ్ సర్వీస్ అవార్డు" ప్రదానం చేశారు. ఈ అవార్డును మాజీ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతుల మీదుగా అందజేయడం విశేషం.ఈ సందర్భంగా రాజ్ ఆచార్య మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో సైకాలజిస్టుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్యం, కుటుంబ సమస్యలు, యువతలో పెరుగుతున్న వ్యసనాలు, ఆత్మహత్యలు, హత్యలు వంటి అనేక సామాజిక సమస్యలను అరికట్టడంలో సైకాలజిస్టుల సేవలు ఎంతో అవసరమని అన్నారు.తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు, వ్యవస్థాపకులు డాక్టర్ ముత్యూరి రామచందర్ సైకాలజిస్టులకు రాష్ట్ర స్థాయి కౌన్సిల్ ఏర్పాటు చేసి, వృత్తి పరమైన గుర్తింపు కల్పించేందుకు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. సైకాలజిస్టులకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించే దిశగా అసోసియేషన్ చురుకుగా పనిచేస్తోందని తెలిపారు.యువ సైకాలజిస్టులు, సైకాలజీ విద్యార్థులు తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ సభ్యత్వం తీసుకొని, సంస్థ నిర్వహించే అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని రాజ్ ఆచార్య పిలుపునిచ్చారు.అసోసియేషన్‌లో చేరదలచిన వారు రాజ్ ఆచార్యను 9059958271 నంబరులో సంప్రదించవచ్చని తెలిపారు.

బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

మల్కాజిగిరి మే 15, ప్రభాతవార్త:
మైనర్ బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథును వెంటనే అరెస్టు చేయాలని గౌతమ్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ డిమాండ్ చేశారు. మల్కాజిగిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు ట్యాంక్ బండ్ వద్ద శుక్రవారం చేపట్టిన ధర్నా కార్యక్రమంలో ఆమె పాల్గొని నిరసన వ్యక్తం చేశారు కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో తెలంగాణ రాష్ట్రంలో మైనర్ బాలికలతో పాటు మహిళలకు రక్షణ లేదని ఆ విధంగా వ్యక్తం చేశారు 8వ తేదీ బండి భగీరథ పై ఫోక్సో కేసు నమోదు అయినప్పటికీ నేటి వరకు ఎందుకు అరెస్టు చేయలేదని ఆమె ప్రశ్నించారు. తక్షణమే భగీరథును అరెస్టు చేసి జైలుకు పంపాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్ ని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు

సమస్య పరిష్కరించిన పున్న గణేష్‌నేత

కాలనీవాసులతో మాట్లాడుతున్న పున్న గణేష్‌నేత

ఎల్.బి.నగర్, మే 15 ప్రభాతవార్త: శ్రీరామకృష్ణపురం డివిజన్ వాసవి కాలనీ రోడ్‌నెంబర్ 1/ఏలో గత పదిహేను సంవత్సరాల నుండి నిరుపయోగంగా ఉన్న మోడల్ లైటింగ్ సిస్టమును సుధాకర్‌శర్మ స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లిన పరిష్కరించకపోవడంతో నా దృష్టికి తీసుకువచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి శుక్రవారం కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో కలిసి నిరుపయోగముగా ఉన్న మోడల్ లైటింగ్ సిస్టంను అధికారుల సహకారంతో బాగు చేయించడం జరిగిందని శ్రీరామకృష్ణపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత పేర్కొన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి సహకారంతో డివిజన్లోని కాలనీలలో సమస్యలు లేని డివిజన్‌గా అభివృద్ధి చేయడమే ప్రథమ కర్తవ్యంగా భావించి ముందుకెళ్తామన్నారు కార్యక్రమంలో వాసవికాలనీ రోడ్‌నెంబర్ 1/ఏ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జెల్లా జగన్నాథం, కార్యదర్శి మల్లేష్ యాదవ్, ఉపాధ్యక్షులు లింగారెడ్డి, కోశాధికారి శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌శర్మ, భాస్కర్, సుధాకర్‌గుప్తా, నాగరాజు, పురుషోత్తం గుప్త, సూర్యనారాయణగుప్త, జంగారెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

వెంకటరెడ్డినగర్‌లో యూత్ కాంగ్రెస్ నేత అరుణ్ బస్తీబాట

బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నేత ఆకారపు అరుణ్ పటేల్

రామంతాపూర్, మే 15 ప్రభాతవార్త : రామంతాపూర్ వెంకటరెడ్డినగర్ డివిజన్‌లో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నేతలు బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు బస్తీలలో పర్యటిస్తూ స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడి, వారి సమస్యలను ఆకారపు అరుణ్ అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ పైప్‌లైన్ మరియు కొత్త మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేయాలని, లోప్రెషర్ తాగు నీటి సరఫరా సమస్య వల్ల ప్రజలు ఇబంది పడుతున్నారని ఫిర్యాదు చేశారు. పలు రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కొత్త రోడ్డు కొత్త రోడ్ల నిర్మాణం చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం కమిటి మాజీ చైర్మన్ నామ్ రాజిరెడ్డి, డైరెక్టర్ అరుణ్ సాయి, కాలనీ వాసులు బి రాము, కృష్ణ, అశోక్, ఆనంద్, మోహన్, వెంకటయ్య, చారి పోశయ్య, మహేష్, సందీప్, కుర్మ మహేష్, బిక్షపతి, శ్రీకాంత్, ఆకాష్, చోటా రాజేష్ సునీల్, మిట్టు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో విద్యుత్ సమస్య పరిష్కారం : ఎం.డి.రఫీక్

రామంతాపూర్, మే 15 ప్రభాతవార్త : రామంతాపూర్ ఇందిరానగర్, శేఖర్ బస్తీలతో విద్యుత్ లోవోల్టేజీ సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎం.డి.రఫీక్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా రామంతపూర్ డివిజన్ ఇందిరానగర్, శేఖర్ బస్తీ మరియు మజీద్ గల్లీలో పర్యటించారు.ఈ సందర్భంగా పలువురు స్థానికులు విద్యుత్ లో వోల్టేజ్ సమస్యను వివరించారు.విద్యుత్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.విద్యుత్ ఎఇ ఏఈ లావణ్యతో ఫోన్‌లో మాట్లాడి విద్యుత్ అధికారి సారయ్య, శ్రీనివాస్ సంఘటన స్థలానికి పిలిపించి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆదినారాయణ గౌడ్, గంగపుత్ర భాస్కర్, లఘుసాని శ్రీనివాస్ గౌడ్, ఎండీ షకీల్, అబ్దుల్ మతిన్, మహేష్, ఎండి నయీమ్, చిన్న కుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో గృహిణి అదృశ్యం

నేరేడ్ మెట్ మే 15:ప్రభాతవార్త

కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ గృహిణి ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయిన ఘటన నేరేడ్మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలం కురింగం కాలనీకి చెందిన అంబాల రోజా (29) ప్రస్తుతం భర్త మణికంతతో కలిసి పీబీ కాలనీ, ఓల్డ్ సఫిల్‌గూడలో నివాసం ఉంటోంది.ఈ నెల 14వ తేదీ ఉదయం కుటుంబ విషయమై భార్యాభర్తల మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. అనంతరం మనస్తాపానికి గురైన రోజా ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, పరిచయస్తుల వద్ద గాలించినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. ఆమె సెల్‌ఫోన్‌కు సంప్రదించగా స్విచ్‌ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది.భర్త అంబాల మణికంత ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ లో మహిళ అదృశ్యం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గృహిణి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.